నవతెలంగాణ
నమ్మిన తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
1
మంగళవారం | ఫిబ్రవరి 25, 2025 | www.navatelangana.com

మద్యం మత్తులో మహారాష్ట్ర వాసి ఆత్మహత్య

వాంకిడి: మహారాష్ట్రకు చెందిన ఓ వ్యక్తి మద్యం మత్తులో పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ ప్రశాంత్ తెలిపిన వివరాల ప్రకారం..మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లా హెరెవా గ్రామానికి చెందిన హెడెబె సుదాం(33) భార్య సావిత్రిబాయితో పాటు ఇద్దరు ఆడ పిల్లలు, కుమారుడితో కలిసి మండలంలో ఉంటున్నాడు. కూలి పనులు చేస్తూ జీవనం సాగించేవారు. కొంతకాలంగా మద్యానికి బానిసై కూలి డబ్బులను మద్యానికే ఖర్చు చేసేవాడు. ఆదివారం భార్యతో కలిసి అత్తగారిల్లు అయిన హీరాపూర్‌కు వెళ్లాడు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న సుదాం సోమవారం ద్విచక్ర వాహనంపై మండల కేంద్రానికి వచ్చాడు. స్థానికంగా ఉన్న ఫర్టిలైజర్ దుకాణంలో పురుగులమందు కొనుగోలు చేసి అర్లి గ్రామ శివారులోని పత్తి చేనులోకి వెళ్లి తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. స్పృహ తప్పి పడిపోయి ఉండటాన్ని గమనించిన కొందరు వ్యక్తులు పోలీసులకు సమాచారం అందజేశారు. మృతుడి అన్న సంతోష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



మహాశివరాత్రి జాతరకు ప్రత్యేక బస్సులు : డీఎం విశ్వనాథ్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించే మహాశివరాత్రి జాతరకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు ఆసిఫాబాద్ డిపో మేనేజర్ విశ్వనాథ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు 28 ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు తెలిపారు. వీటిలో వాంకిడి జాతరకు ఆసిఫాబాద్ నుండి 3 బస్సులు, ఈస్‌గాం జాతరకు కాగజ్‌నగర్ నుండి 6 బస్సులు, బెల్లంపల్లి నుండి బుగ్గ జాతరకు 15 బస్సులు, ఆసిఫాబాద్ నుండి రెబ్బెన మండలం నంబాల జాతరకు 4 బస్సులు నడుపుతున్నట్లు పేర్కొన్నారు. జాతరకు వెళ్లే ప్రతి బస్సులో మహాలక్ష్మి స్కీం వర్తిస్తుందని, భక్తులు ఆర్టీసీ బస్సుల్లోనే సుఖవంతమైన ప్రయాణం చేయాలని కోరారు.

జిల్లా అభివృద్ధికి కట్టుబడి ఉంటా..!

- అవసరమైన నిధులు మంజూరుకు కృషి చేస్తా
- మంచిర్యాల సభలో సీఎం రేవంత్‌రెడ్డి భరోసా
- భారీగా హాజరైన పట్టభద్రులు



అభివాదం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు



హాజరైన పట్టభద్రులు, కాంగ్రెస్ శ్రేణులు



మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి, పక్కన ఎమ్మెల్సీ అభ్యర్థి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి

నవతెలంగాణ-మంచిర్యాల

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను దత్తత తీసుకున్నానని, జిల్లా సమగ్ర అభివృద్ధికి పూర్తి స్థాయిలో కట్టుబడి ఉంటానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భరోసా ఇచ్చారు. ఇప్పటికే అనేక అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేశామని, రానున్న రోజుల్లో అవసరాల మేరకు నిధులు కేటాయించి అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సోమవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించిన పట్టభద్రుల సభకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ అధ్యక్షతన నిర్వహించిన సభకు వివిధ ప్రాంతాలకు చెందిన పట్టభద్రులు, కాంగ్రెస్ శ్రేణులు భారీగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి జిల్లా అభివృద్ధికి కట్టుబడి ఉంటానని భరోసా ఇచ్చారు. అంతకముందు స్థానిక ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే రూ.2వేల కోట్లతో మంచిర్యాల నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి పనులను చేపట్టామని, ఇంకా ఆయా పనులకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని సీఎంను కోరారు. స్పందించిన సీఎం ప్రేమ్‌సాగర్‌రావు కోరిన నిధుల మంజూరుకు హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 10ఏండ్లలో ఎలాంటి ఉద్యోగాలు కల్పించలేదని, తాము అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 56వేల ఉద్యోగాలు కల్పించి నిరుద్యోగుల ఆశలు నెరవేర్చామని గుర్తు చేశారు. పదేళ్ల పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని వర్గాలను మోసం చేసిందని ఆరోపించారు. తేమ పేరుతో రైతులను మోసగించిందని మండి పడ్డారు. ఎమ్మెల్సీ నియోజకవర్గం పరిధిలో నలుగురు బీజేపీ ఎంపీలు ఉండి నిరుద్యోగులకు చేసిందేమీ లేదని వ్యాఖ్యానించారు.

నిరుద్యోగులకు అండగా రేవంత్‌రెడ్డి

నిరుద్యోగులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆపద్బాంధవుడిగా నిలుస్తున్నారని, ఉద్యోగ నియామకాలు చేపట్టి వారి జీవితాల్లో వెలుగులు నింపారని మంత్రులు శ్రీధర్‌బాబు, సీతక్క కొనియాడారు. తాజాగా అంగన్వాడీలో ఉద్యోగాలకు నోటిఫికేషన్ సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే రాష్ట్రంలో ఆరు గ్యారంటీ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని ప్రజలకు గ్యాస్ రాయితీ, ఉచిత విద్యుత్ తదితర సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. భావోద్వేగాలతో పదవులు పొందిన బీజేపీ నాయకులు చేసిందేమీ లేదని విమర్శించారు. ఎమ్మెల్సీ నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యావేత్తగా అనేక మందికి నాణ్యమైన విద్యను అందిస్తున్నామని తెలిపారు. తనను ఎమ్మెల్సీగా గెలిపిస్తే ప్రభుత్వంతో మాట్లాడి ఆదిలాబాద్ జిల్లాలో యూనివర్సిటీకి కృషి చేస్తానని, అలాగే నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి పని చేస్తానని పేర్కొన్నారు. గెస్ట్, కాంట్రాక్ట్ లెక్చరర్ల సమస్యల పరిష్కారానికి పాటుపడతానని, సింగరేణిలో పని చేసే పట్టభద్రుల సమస్యలు విన్నానని, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పట్టభద్రులకు సేవ చేసే అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, ప్రభుత్వ సలహాదారు వేణుగోపాల్, ఎమ్మెల్యేలు గడ్డం వివేక్, వినోద్, వెడ్మ బొజ్జు, గండ్ర సత్యనారాయణ, శ్రీగణేష్, ఎమ్మెల్సీ దండే విఠల్, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్, ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు, నియోజకవర్గ ఇన్‌చార్జీలు కంది శ్రీనివాస్‌రెడ్డి, శ్యామ్‌నాయక్, రావి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు

- నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్



నవతెలంగాణ-నిర్మల్

ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎస్పీ జానకి షర్మిలతో కలిసి పలు రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ కొనసాగుతుందన్నారు. ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి జిల్లాలో మొత్తం 46 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో మొత్తం 19,107 మంది తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారని తెలిపారు. ఇందులో 17,141 మంది పట్టభద్రులు, 1,966 మంది ఉపాధ్యాయులు ఉన్నారని తెలిపారు. ఇప్పటికే ఓటరు గుర్తింపు స్లిప్పుల పంపిణీ ప్రక్రియ ప్రారంభమైందని, ఈ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేస్తామని తెలిపారు. ఓటరు అవగాహన పెంపొందించడానికి ఆర్డీఓ కార్యాలయంలో అవగాహన కేంద్రాన్ని అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రవర్తన నియమావళిని తప్పనిసరిగా పాటించాలన్నారు. ఇప్పటికే పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించినట్లు తెలిపారు. అన్ని పోలింగ్ కేంద్రాలలో లైవ్ వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇప్పటికే ఎన్నికల విధులు నిర్వహించే అధికారులకు మాస్టర్ ట్రైనర్లతో రెండుసార్లు శిక్షణ ఇచ్చామని తెలిపారు. ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణను ప్రశాంతంగా పూర్తి చేసేందుకు పటిష్ట పోలీసు బందోబస్తును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 8 చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామని, ఇప్పటి వరకు రూ.38లక్షల6వేల830 నగదు, రూ.3లక్షల3వేల విలువ గల 827 లీటర్ల మద్యాన్ని, రూ.5వేల750 విలువ చేసే నిషేధిత మత్తు పదార్థాలను, పీడీఎస్ బియ్యం, గుట్కా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సమావేశంలో ఆర్డీఓ రత్నకళ్యాణి, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు శ్రీనివాస్, రాజకీయ పార్టీల ప్రతినిధులు శ్రవణ్‌రెడ్డి, సిరికొండ రమేష్, గంద్రత్ రమేష్, హైదర్, మజార్, జగన్ మోహన్ పాల్గొన్నారు.

టెన్త్ వార్షిక పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో మార్చి 21 నుండి ఏప్రిల్ 4 వరకు జరగనున్న 10వ తరగతి వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 10వ తరగతి వార్షిక పరీక్షల నిర్వహణ సందర్భంగా జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో పరీక్షా కేంద్రాల ముఖ్య పర్యవేక్షకులు, శాఖ అధికారులు, పేపర్ కస్టోడియన్లు, రూట్ అధికారులు, సహాయ రూట్ అధికారులకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో జరగనున్న 10వ తరగతి వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. పరీక్షల నిర్వహణ కొరకు జిల్లాలో 36 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, 641 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారని తెలిపారు. పరీక్ష కేంద్రాలలో మొబైల్, ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించడం జరగదని, పరీక్ష కేంద్రాల నిర్వహణ కొరకు పోలీస్, వైద్య, తపాల, రెవెన్యూ అధికారుల సమన్వయంతో పని చేయాలని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పరీక్ష గదులను సూచించాలని, ఈ పరీక్షలలో 24 పేజీలతో ఒక బుక్‌లెట్‌గా విద్యార్థులకు అందించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేందుకు ముఖ్య పర్యవేక్షకులు, శాఖ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని, సిసి కెమెరాల పర్యవేక్షణలో సమాధాన, ప్రశ్న పత్రాలను ఓపెన్ చేయడం, పరీక్ష ముగిసిన తరువాత సమాధాన పత్రాల సీలింగ్ నిబంధన ప్రకారం పూర్తి చేయాలని తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రభుత్వ పరీక్షల అధికారి మర్యాల ఉదయభాను, అధికారులు పాల్గొన్నారు.

సాంప్రదాయ క్రీడలపై రాష్ట్ర ప్రభుత్వం చిన్న చూపు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ సాంప్రదాయ క్రీడలపై రాష్ట్ర ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. ఢిల్లీ వేదికగా నిర్వహించిన ఖోఖో ప్రపంచకప్‌లో ప్రాతినిధ్యం వహించిన ఆదిలాబాద్ పోస్టల్ డిపార్ట్మెంట్‌కు చెందిన క్రీడాకారుడు శివారెడ్డిని మాజీ మంత్రి జోగు రామన్న పూల బొకే అందించి శాలువాతో ఘనంగా సత్కరించి మిఠాయిలు తినిపించారు. ఖోఖో ప్రపంచకప్‌లో మహిళా జట్టుతో పాటు బాలుర జట్టు ప్రపంచ కప్‌లు సాధించడం అభినందనీయమన్నారు. తెలుగు తేజం శివారెడ్డి జాతీయ జట్టులో రాణించడం అభినందనీయమన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించడంలో జోగు ఫౌండేషన్ ముందుంటుందని కొనియాడారు. ప్రపంచ కప్ గెలిచిన ఖోఖో జట్టును ప్రభుత్వం గుర్తించకపోవడం తగదన్నారు. యువత చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాల్సిన అవసరముందని, అలాంటి వారికి ప్రోత్సాహం కరువవుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సాజిదొద్దీన్, దమ్మపాల్, బట్టు సతీష్, ఉగ్గే విఠల్, శివకుమార్, రాహుల్, ఇబ్రహీం, ప్రశాంత్ పాల్గొన్నారు.

మహిళా సాధికారితకు బ్యాంకులు చేయూతనందించాలి

నిర్మల్: మహిళా సాధికారితకు బ్యాంకులు చేయూతను అందించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ బ్యాంక్ అధికారులను ఆదేశించారు. సోమవారం రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల్లో భాగంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. సోమవారం నుంచి ఈ నెల 28 వరకు ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళల ఉన్నతి కోసం బ్యాంకులు ఎన్నో రకాల సదుపాయాలను కల్పిస్తున్నాయని తెలిపారు. మహిళలకు సంబంధించి ఆర్థిక అంశాలతో ముడిపడి ఉన్న అన్ని రకాల పథకాలపై మహిళలకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. స్వయం సంఘాలకు చేయూతనివ్వడానికి ఎన్నో పథకాలు ఉన్నాయని, మహిళా సాధికారిత సాధించడానికి ఎంతగానో తోడ్పడతాయని తెలిపారు. మహిళలకు పొదుపుపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. బ్యాంకు సహకారంతో మహిళలు వాణిజ్య, వ్యాపార రంగాల్లో రాణించగలుగుతున్నారని తెలిపారు. ఆర్థిక అక్షరాస్యతపై మహిళలు అందరూ తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఈ వారోత్సవాల్లో భాగంగా ఈ నెల 25న మంగళవారం 2కే రన్ నిర్వహించాలని, యువత, మహిళలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. అనంతరం అధికారులతో కలిసి కలెక్టర్ ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. సమావేశంలో జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్‌గోపాల్, ఆర్డీఓ రత్నకళ్యాణి, డీఆర్డీఓ విజయలక్ష్మి, డీఈఓ పి.రామారావు, వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్, డీఎంహెచ్ఓ రాజేందర్, డీవైఎస్ఓ శ్రీకాంత్‌రెడ్డి, డీహెచ్ఎస్ఓ రమణ పాల్గొన్నారు.

సేవాలాల్ జీవిత చరిత్ర ప్రతి ఒక్కరికీ ఆచరణీయం

- జయంతి వేడుకల్లో పాల్గొన్న కలెక్టర్, ఐటీడీఏ పీవో
- లంబాడాలతో కలిసి కలెక్టర్, పీఓ నృత్యం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సేవాలాల్ జీవిత చరిత్ర ప్రతి ఒక్కరికీ ఆచరణీయమని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. శనివారం రాంలీలా మైదానంలో సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతిని అధికారికంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఐటీడీఏ పీఓ కుష్బుగుప్తాతో కలిసి కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సేవాలాల్ చిత్రపటానికి పూజలు చేశారు. అంతకు ముందుకు లంబాడి సంస్కృతి ప్రకారం బోగ్ బండార్ నిర్వహించారు. మహిళలు, యువతులు సాంప్రదాయ దుస్తులు ధరించి నృత్యాలు చేయడం ఆకట్టుకుంది. వారితో కలిసి కలెక్టర్, ఐటీడీఏ పీఓ సాంప్రదాయ దుస్తులు ధరించి నృత్యాలు చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో ప్రతి మనిషి సమానమని, ఏండ్ల క్రితమే సంత్ సేవాలాల్ తెలిపారన్నారు. సేవా గుణంతో అందరిని అక్కున చేర్చుకున్న మహనీయుడని కొనియాడారు. ఆయన జీవిత చరిత్రను నేటి తరం తెలుసుకుంటు కమ్యూనిటికి సంబంధం లేకుండా సేవ చేస్తే సమాజంలో ఉన్న కష్టాలు తొలగుతాయన్నారు. ఆయన చూపిన మార్గం ద్వారా రాజ్యాంగంలో పలు ఆర్టికల్స్ ఉన్నాయని, స్వాతంత్ర్యం కూడా అహింస మార్గం ద్వారానే సిద్ధించిందన్నారు. సేవాలాల్ సూక్తులను కేవలం లాంబాడీలే కాకుండా అన్ని వర్గాల వారు ఆచరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బంజారా సేవా సంఘం జాతీయ అధ్యక్షుడు అమర్ సింగ్ తిలావత్, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు రాథోడ్ భీంరావ్, గజానంద్, పవన్ నాయక్, జాదవ్ బలిరాం, ఆడె మానాజీ, శివలాల్ నాయక్, సురేష్ రాథోడ్ పాల్గొన్నారు.

బంజారా సమాజం స్వయం కృషితో రాణిస్తుండడం ప్రశంసనీయం

సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ స్ఫూర్తితో బంజారా సమాజం స్వయం కృషితో రాణిస్తుండడం ప్రశంసనీయమని ఎంపీ గోడం నగేష్ అన్నారు. సోమవారం రాంలీలా మైదానంలో నిర్వహించిన సేవాలాల్ జయంతి ఉత్సవాల్లో ఎమ్మెల్యేలు పాయల శంకర్, అనిల్ జాదవ్, మాజీ మంత్రి జోగు రామన్న, ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం జాతీయ అధ్యక్షుడు అమర్ సింగ్ తిలావత్‌తో కలిసి ఎంపీ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా లంబాడీలు వారి సంప్రదాయ నృత్యాలు చేసి ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ పట్టుదల, కష్టపడే తత్వం వంటి అంశాలను సేవాలాల్ మహారాజ్ నుండి స్ఫూర్తిగా తీసుకొని అనుకున్న లక్ష్యాన్ని ఛేదించేదాకా అలుపెరగక ముందుకు సాగాలన్నారు. లక్ష్య ఛేదనలో అవాంతరాలు సహజమని, ఆత్మస్థైర్యంతో అధిగమించినప్పుడే గమ్యాన్ని చేరవచ్చన్నారు. మహనీయుడు ఆదర్శాలతో బంజార సమాజం అనతికాలంలోనే మంచి పురోభివృద్ధి సాధించడం హర్షణీయమన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ గొడెం నగేష్



లంబాడీ మహిళలతో కలిసి నృత్యం చేస్తున్న ఐటీడీఏ పీఓ

ఎన్నికల్లో బీసీ అభ్యర్థులను గెలిపించాలి

- బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాష్ట్ర జనాభాలో 60 శాతం ఉన్న బీసీలను పాలక ప్రభుత్వాలు, పార్టీలు కేవలం ఓటు బ్యాంకుగానే వాడుకుంటున్నాయని, ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో సత్తా చాటేలా బీసీ అభ్యర్థులను గెలిపించుకొని బీసీ రాజకీయ శకానికి నాంది పలకాలని బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం జిల్లాకు వచ్చిన ఆయన వెనుకబడిన తరగతుల పట్ల పాలకులు అనుసరిస్తున్న వివక్షను ఎండగట్టారు. స్థానిక బీసీ సంఘ భవనంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికలు పార్టీలు, సంఘాల మధ్య జరుగుతున్నవి కాదని, రెండు సామాజిక వర్గాల మధ్యే పోటీ నెలకొందని పేర్కొన్నారు. రాష్ట్రం కోసం, ప్రజల కోసం ఏ త్యాగం చేశారని కాంగ్రెస్ నరేందర్‌రెడ్డికి టిక్కెట్ ఇచ్చిందని ప్రశ్నించారు. కేవలం రెడ్డి అనే ఏకైక కారణంతో ఆయనకు టిక్కెట్ ఇవ్వడమే కాక సీఎం స్థాయి వ్యక్తి ఆయన తరపున ప్రచారం చేయడమంటే నైతికంగా ఓటమిని అంగీకరించినట్లేనని పేర్కొన్నారు. అందుకు ధీటుగా బీసీ అభ్యర్థులను గెలిపించుకునేలా వెనుకబడిన తరగతుల వారిని చైతన్య పరుస్తున్నామన్నారు. ఓటు మనదే, సీటు మనదే, మేమెంతో మాకంతా అనే నినాదంతో ముందుకు సాగుతూ ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఒక ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానంతో పాటు రెండు పట్టభద్రుల స్థానాలను కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలన్నీ ఏకమై బీసీ బిడ్డ పట్టభద్రుల స్వతంత్ర అభ్యర్థి ప్రసన్న హరికృష్ణను, ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా మల్క కొమురయ్యను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చిక్కాల దత్తు, కలాల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు అశోక్, నర్సాగౌడ్, అంజన్న, శ్రీనివాస్, రమ, ఉమమహేశ్వరి, గంగామణి, పద్మ పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ టవర్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో మారుమూల ప్రాంతాలలో సైతం సిగ్నల్ అందించే విధంగా సెల్‌ఫోన్ టవర్ల ఏర్పాటుకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, అటవీ అధికారి సుశాంత్‌తో కలిసి బీఎస్ఎన్ఎల్ టవర్ల నిర్మాణాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో బీఎస్ఎన్ఎల్ ఆధ్వర్యంలో టవర్ల నిర్మాణం, పెండింగ్ ఉన్న టవర్లపై అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. రెవెన్యూ శాఖ అధికారులు పెండింగ్‌లో ఉన్న టవర్ల నిర్మాణ స్థలాలను 2రోజులలో డిజిపిఎస నిర్వహించి నివేదికలు రూపొందించాలని తెలిపారు. అధికారుల సమన్వయంతో టవర్ల నిర్మాణానికి కృషి చేయాలని, మారుమూల గ్రామాలకు టవర్ల నిర్మాణం ద్వారా సేవలు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు, ఫారెస్ట్ రేంజ్ అధికారులు, బీఎస్ఎన్ఎల్ అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిభ కనబర్చిన అధికారులకు ప్రశంసా పత్రాలు



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

ఆపరేషన్ స్మైల్ 11వ విడతలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన అధికారులకు ఎస్పీ డా.జి.జానకి షర్మిల సోమవారం పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రశంసా పత్రాలను అందించారు. బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించడంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆపరేషన్ స్మైల్-11లో జిల్లా వ్యాప్తంగా 66 మంది బాలలను గుర్తించి వారి తల్లిదండ్రుల వద్దకు చేర్చడానికి జిల్లా వ్యాప్తంగా ఆపరేషన్ స్మైల్ కార్యక్రమాన్ని అన్ని శాఖల సమన్వయంతో విజయవంతంగా నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఆపరేషన్ స్మైల్ విజయవంతం కోసం జిల్లాలో 5 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఇందులో భాగంగా జనవరి 1 నుండి 31 వరకు నెల రోజుల పాటు ఆపరేషన్ స్మైల్-11 కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా నిర్వహించామని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా చిన్న పిల్లలను పనిలో పెట్టుకున్న 30 మందిపై కేసులు నమోదు చేశామన్నారు. బాలల హక్కులను కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా కృషి చేయాలని కోరారు. ఎవరైన బాలలను పనిలో పెట్టుకున్నట్లు తెలిస్తే వెంటనే డయల్ 100కి ఫోన్ చేసి పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఉపేంద్రరెడ్డి, రాజేష్ మీన, సీపీపీఓ నాగలక్ష్మి, సిడబ్ల్యూసి చైర్మన్ వాహిద్, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ రాజలింగు, డీసీపీఓ మురళీ, ఆపరేషన్ స్మైల్-11లో బాధ్యతలు నిర్వహించిన అధికారులు పాల్గొన్నారు.

కష్టపడి మంచి ర్యాంకులు సాధించాలి

నవతెలంగాణ-ఖానాపూర్

విద్యార్థులు కష్టపడి మంచి ర్యాంకులు సాధించాలని పాఠశాల డైరెక్టర్ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం రాత్రి కృష్ణవేణి పాఠశాల పదో తరగతి విద్యార్థులకు విడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు.



ఈ కార్యక్రమంలో విద్యార్థులు పలు పాటలపై నృత్యాలు చేసి అలరించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ గార్ల శ్రీనివాస్, ప్రిన్సిపాల్ రమేష్ మాట్లాడారు. పదో తరగతి విద్యార్థులు కష్టపడి చదివి ర్యాంకులు సాధించాలని అన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

గంజాల్ టోల్ ప్లాజా వద్ద రూ.18 లక్షల నగదు స్వాధీనం

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

నిర్మల్ జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో సోన్ మండలం గంజాల్ టోల్ ప్లాజా వద్ద సోమవారం పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. ఓ వ్యక్తి కారులో నగదు తీసుకెళ్తుండగా రూ.18 లక్షలు స్వాధీనం చేసుకున్నట్టు నిర్మల్ డివిజన్ ఏఎస్పీ రాజేష్ మీనా తెలిపారు. వాహనాల్లో నగదు తీసుకెళ్తే సంబంధిత పత్రాలు తప్పనిసరిగా చూపించాలన్నారు. ఇందులో సీఐ నవీన్ కుమార్, ఎస్సై గోపి ఉన్నారు.



ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు సీపీఐ(ఎం) మద్దతు

- కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని గెలిపించాలి
- సీపీఐ(ఎం) జిల్లా కమిటీ పిలుపు



మాట్లాడుతున్న సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మెదక్, ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో సీపీఐ(ఎం) కాంగ్రెస్ అభ్యర్థి వి.నరేందర్‌రెడ్డికి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్టు పార్టీ జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ వెల్లడించారు. సోమవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్రంలో గత 10 ఏండ్లుగా అధికారంలో కొనసాగుతున్న బీజేపీ రెండు కోట్ల ఉద్యోగాల కల్పన హామీని గాలికి వదిలేసిందన్నారు. పైగా ప్రభుత్వ రంగ సంస్థల్లో 100శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు అవకాశం కల్పిస్తూ, బడ్జెట్ ప్రవేశ పెట్టారన్నారు. దీనిఫలితంగా ప్రభుత్వరంగ సంస్థలు మూతపడి నిరుద్యోగులకు ఉద్యోగాలు వచ్చే అవకాశం లేకుండా పోతోందన్నారు. పెరుగుతున్న ప్రయివేటు రంగంలో రిజర్వేషన్లు కల్పించకుండా ఉన్న కొద్దిపాటి రిజర్వేషన్లను కూడా తొలగించే కుట్రలు చేస్తున్నదన్నారు. నిరుద్యోగ సమస్య గత ఎన్నడూ లేనంతగా పెరిగిపోయిందని, పనుల కోసం యువత వలస బాట పడుతున్నారన్నారు. కార్పొరేట్ సంస్థలకు కోట్లాది రూపాయలు లాభాలు చేస్తున్న బీజేపీ ప్రభుత్వం ఆ సంస్థల్లో మాత్రం యువతకు రిజర్వేషన్ ఆధారంగా ఉద్యోగల కల్పన చేయడం లేదన్నారు. ఉత్తర తెలంగాణ జిల్లాల నుంచి 8 మంది ఎమ్మెల్యేలు నలుగురు మంది ఎంపీలు, ఒక కేంద్ర మంత్రి ఉన్నప్పటికీ ఇప్పటి వరకు ఈ జిల్లాలకు ప్రత్యేక నిధులు తీసుకొచ్చి అభివృద్ధి పరిచింది లేదన్నారు. బడ్జెట్‌లో సైతం గుండు సున్నా చూపిన బీజేపీ నోరు మెదపడం లేదన్నారు. ఆదిలాబాద్ జిల్లా ప్రజలు ఎంతగానో ఎదురు చూస్తున్న సిమెంట్ పరిశ్రమను తెరిపించడం లేదని, ఆదిలాబాద్ నుంచి ఆర్మూర్ రైల్వే లైన్ మంజూరుకు నోచుకోవడం లేదన్నారు. అలాగే విమానాశ్రయం నిర్మాణం కూడా కలగానే మిగిలిపోతుందన్నారు. గిరిజన యూనివర్సిటీ వేరేచోటికి తరలిపోతున్న పల్లెత్తి మాట కూడా మాట్లాడలేదని మండిపడ్డారు. అభివృద్ధిని ఏమాత్రం పట్టించు కోకుండా కేవలం మూత కోణంలో ప్రజలను చీల్చి ఓట్ల వ్యాపారం బీజేపీ చేస్తుందని మండిపడ్డారు. బీజేపీకి తగిన గుణపాఠం చెప్పాలంటే,

భవిష్యత్తులో వారు అభివృద్ధి వైపు ఆలోచించాలంటే ఈ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిని పట్టభద్రులు ఓడించి విజ్ఞతను చాటాలని అయన కోరారు. బీజేపీ అభ్యర్థిని ఓడించడానికి కాంగ్రెస్ అభ్యర్థికి తమ పార్టీ మద్దతు ఇస్తున్నట్టు పేర్కొన్నారు. పార్టీ నాయకులు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు లంక రాఘవులు, సీనియర్ నాయకులు బండి దత్తాత్రి, జిల్లా కమిటీ సభ్యులు ఆర్.మంజుల, ఆత్రం కిష్టన్న, బొజ్జ ఆశన్న, ఎస్.స్వామి నాయకులు లింగాల చిన్నన్న, కోవే శకుంతల పాల్గొన్నారు.

'అనుచిత వ్యాఖ్యలు సరికాదు'



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వెంకటేష్ నేత వెంటనే క్షమాపణ చెప్పాలని మాల సంఘం జిల్లా అధ్యక్షుడు కొప్పుల రమేష్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. ఇటీవల సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో వెంకటేష్ నేత చెన్నూరు ఎమ్మెల్యేపై వ్యక్తిగత విమర్శలకు పాల్పడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వెంకటేష్ నేత వ్యక్తిగత ప్రయోజనాల కోసం బీజేపీ ఏజెంట్‌ల పనిచేస్తూ, వివేక్ వెంకటస్వామిని మాలలసింహ గర్జన, మాలల జనాభాను అడ్డుపెట్టుకొని, ఎస్సీ వర్గీకరణను స్వప్రయోజనాల కోసం అడ్డుకుంటున్నారని అనడం సరికాదన్నారు. వెంకటేష్ నేత మంద కృష్ణ ఏనాడు ఎస్సీ, ఎస్టీ, బీసీలకు నష్టం కలిగించే ఈబీసీ రిజర్వేషన్ గురించి గానీ, జీవో నెంబర్ 29 గురించి మాట్లాడారు. గాని ఎస్సీ వర్గీకరణ గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ఇకనైనా తమ ప్రవర్తన మార్చుకోవాలని, బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు, మేకల మల్లన్న, ఏరా సుధీర్, పాశం రాఘవేంద్ర, సింగరి అశోక్, మేదరి స్వామి, బోండ్ల భూమన్న, విమల, నర్సింలు, రాములు, పోశెట్టి, పొచ్చన్న, రాజు పాల్గొన్నారు.

ప్రయివేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-నిర్మల్ టౌన్

ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ముందస్తు అడ్మిషన్లు చేస్తూ, అధిక ఫీజులు వసూలు చేస్తున్న విద్యా ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర కోశాధికారి వి.మహేందర్ అన్నారు. సోమవారం ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థుల ఐక్యత ఆధ్వర్యంలో డీఈఓ కార్యాలయంలో సూపరింటెండెంట్ రమణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వాగ్మారే మహేందర్ మాట్లాడుతూ విద్యా సంవత్సరం ముగించక ముందే పాఠశాలు, ఇంటర్మీడియట్ కళాశాలలు చట్ట విరుద్ధంగా కరపత్రాలు, బ్యానర్లు, యాడ్స్‌తో ప్రచారం చేస్తూ, టీచర్స్‌ని, కొంతమంది పీఆర్‌ఓలను ఏర్పాటు చేసుకొని అడ్మిషన్ క్యాంపియన్ చేయాలంటూ పంపిస్తున్నారు. దీనిని పీడీఎస్‌యూ విద్యార్థి సంఘంగా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని అన్నారు. తక్షణమే విద్యాశాఖ అధికారులు, పేరెంట్స్ ప్రమేయంతో ఫీజులు నిర్దేశించాలని, ప్రతి ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలల్లో పేరెంట్స్ కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. ముందస్తు అడ్మిషన్లకు పాల్పడుతున్న పాఠశాల కళాశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షులు పవార్ కిరణ్, నాయకులు శంకర్ పాల్గొన్నారు.

రక్తదానం చేసిన సామాజిక కార్యకర్త



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

నిర్మల్ పట్టణంలోని కురన్నపేట్‌కు చెందిన సామాజిక కార్యకర్త నిగులపు సంజీవ్ కుమార్ సోమవారం వారి తండ్రి నిగులపు భీమన్న రిటైర్డ్ మున్సిపల్ జవాన్ 11వ వర్ధంతి సందర్భంగా 44వ సారి స్వచ్ఛందంగా రక్తదానం చేసి ఉదారత చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ హోంగార్డు అజర్, లక్ష్మణ్, రాజ్ కుమార్ పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పని చేయాలి



వాకర్స్‌తో మాట్లాడుతూ వాకింగ్ చేస్తున్న మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

నవతెలంగాణ-నిర్మల్

కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పని చేయాలని మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. ఈనెల 27న జరుగబోయే పట్టభద్రుల ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డిని గెలిపించాలని సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజ్, ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వాకర్స్ అసోసియేషన్ సభ్యులతో కలిసి కాసేపు వాకింగ్ చేశారు. కాంగ్రెస్‌కు ఓటు వేయాలని అభ్యర్థించారు. కాంగ్రెస్ ఉద్యోగుల పక్షపాతి అని ఏళ్ల వేళలా ఉద్యోగుల శ్రేయస్సు కోసం ఆలోచించే పార్టీ అని గుర్తుచేశారు. గత ప్రభుత్వం 317 ఆర్టికల్ తెచ్చి ఉద్యోగులను సమస్యలకు గురిచేసిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 56వేల ఉద్యోగాలు ఇచ్చిందని అన్నారు. నిరుద్యోగులు, టీచర్‌లు పట్టభద్రులు కాంగ్రెస్ చేస్తున్న అభివృద్ధి చూసి పార్టీ బలోపేతం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఇందులో అధ్యక్షులు నాళం శ్రీనివాస్, సభ్యులు, నాయకులు ధర్మాజీగారి రాజేందర్, ముడుసు సత్యనారాయణ, రమణారెడ్డి, పాకాల రాంచందర్, శ్రీకాంత్ యాదవ్, మహేష్, సుధాకర్, మేడారం ప్రదీప్, గజేందర్, కృష్ణ, రవి, రమేష్, వంశీ, శ్రీనివాస్, అనుముల భాస్కర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

కడెం : ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని మండలంలోని నచ్చన్‌ఎల్లాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ బొడ్డు గంగన్న కోరారు. సోమవారం నచ్చన్‌ఎల్లాపూర్ గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించి, ఎమ్మెల్సీ ఎన్నికల్లో నరేందర్‌రెడ్డికి ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని పట్టభద్రులను కోరారు. ఈ కార్యక్రమంలో పట్టభద్రులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంబేద్కర్ భవన్‌లో పోలింగ్ చీటీల పంపిణీ



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ చీటీల పంపిణీని సోమవారం నిర్మల్ పట్టణంలోని అంబేద్కర్ భవన్‌లో చేపట్టారు. నిర్మల్ అర్బన్ ఓటర్ల కొరకు ప్రత్యేక కేంద్రం ఏర్పాటు చేసినట్టు అర్బన్ తహసీల్దార్ ఎం.రాజు తెలిపారు. ఈ కేంద్రం మూడు రోజులు ఉంటుందని ఉదయం10 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు సిబ్బంది ఉంటారని, ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్ఐ ఎండీ.మోయినోద్దీన్, దాసరి కిషోర్ ఉన్నారు.

'పాస్‌పోర్ట్ విషయంలో ఆరోపణలు సరికాదు'

- మరోసారి మాట్లాడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటా..
- మాజీ ఎంపీ సోయం బాపూరావు

నవతెలంగాణ-తలమడుగు

పాస్‌పోర్ట్ విషయంలో ఆరోపణలు సరికాదని, మరోసారి మాట్లాడితే చట్టపరంగా ముందుకెళ్తానని మాజీ ఎంపీ సోయం బాపూరావు అన్నారు. సోమవారం మండలంలోని లింగి గ్రామంలో పట్టభద్రులను కలిసి కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని గెలిపించాలని ఓటర్లను కోరారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రమంత్రి కిసాన్‌రెడ్డి సమీక్షలో ప్రస్తుత ఎంపీ గోడం నగేష్ పాస్‌పోర్ట్ విషయంలో ఆరోపణలు చేయడం సరైంది కాదని అన్నారు. ఇలా మరోసారి మాట్లాడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఎంపీ చదువుకొని మాట్లాడుతున్నాడా లేని పక్షంలో బీజేపీ పార్టీ అధ్యక్షులు ట్యూషన్ చెప్పించి, ప్రజల వద్దకు పంపాలన్నారు. పాస్‌పోర్ట్ విషయంలో తనకు కోర్టు నిర్దోషిగా తీర్పు ఇచ్చిందన్నారు. ఎంపీ ప్రజల్లో విలువ పోగొట్టుకోకుండా తెలుసుకొని మాట్లాడితే బాగుంటుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే 56 వేల ఉద్యోగాలను భర్తీ చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డిదేనని అన్నారు. గత ప్రభుత్వం తొమ్మిది సంవత్సరాలుగా పరిపాలించినప్పటికీ ఉద్యోగులకు ప్రతినెల 20, 25న వేతనాలు ఇచ్చేవారని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఒకటో తేదీననే వేతనాలు అందిస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వం దేని అన్నారు. ఈ సమావేశంలో మాజీ జెడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ బొల్లారం బాబన్న, కాంగ్రెస్ మండల కన్వీనర్ కళ్యాణం రాజేశ్వర్, కాంగ్రెస్ నాయకులు గంగారాం, వెంకట్ యాదవ్, రాములు, సాయి, రాకేష్ గ్రామస్తులు పాల్గొన్నారు.



నమూనా బ్యాలెట్ పత్రాలను చూపిస్తున్న మాజీ ఎంపీ సోయం బాపూరావు

సీఎం సభకు హాజరైన డీసీసీ అధ్యక్షుడు



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో పట్టభద్రులతో సీఎం రేవంత్ రెడ్డి నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి నిర్మల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నీళ్ల నిధులు నియామకాల పేరుతో సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో గత ప్రభుత్వ హయాంలో ప్రజలు, ప్రభుత్వ ఉద్యోగులు ఎంతో ఇబ్బందులు పడ్డారని అన్నారు. ప్రజలు మార్పు కోరుకోవడంతో ప్రజా ప్రభుత్వం ఏర్పడిందని, ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందని తెలిపారు. ఈనెల 27న జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు.

ఆర్‌ఎంపీ, పీఎంపీ కుటుంబాలను ఆదుకోవాలి

- జిల్లా ప్రధాన కార్యదర్శి సిపెల్లి నర్సిములు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

ఆర్‌ఎంపీ, పీఎంపీ కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని, ఆర్‌ఎంపీ, పీఎంపీ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు కె.భీముడు, జిల్లా ప్రధాన కార్యదర్శి సిపెల్లి నర్సింలు అన్నారు. సోమవారం పట్టణంలోని ఓ ప్రయివేట్ ఫంక్షన్ హాల్‌లో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రథమ చికిత్స రూపంలో ప్రజలకు తాము వైద్య సేవలు అందిస్తున్నామని అన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 2009 సంవత్సరంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామీణ ప్రాంత వైద్యులకు శిక్షణ ఇచ్చి గుర్తింపు పత్రాలు ఇవ్వాలని నిర్ణయించిందన్నారు. విధి విధానాల కోసం 14 మంది సభ్యులతో చర్చించి, వారికి శిక్షణ ఇచ్చి గుర్తింపు పత్రాలు ఇవ్వాలని సర్కారుకు సూచించిందన్నారు. సుమారు 13వేల మందినీ గుర్తించి కమ్యూనిటీ పారామెడిక్స్‌గా దశలవారీగా 1000 గంటలు క్లినికల్ థియరీ ఫీల్డ్ విభాగాల్లో శిక్షణను ఇచ్చారు. ట్రెనింగ్ పూర్తయి సర్టిఫికెట్స్ ఇచ్చే సమయానికి ఆనాటి సీఎంగా ఉన్న డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మరణించారు. అదే సమయంలో తెలంగాణ ఉద్యమం ఊపందు కోవడం వల్ల విషయం మరుగునపడిందన్నారు. ఈ విషయం గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో కూడా మా అంశాన్ని చేర్చారని అన్నారు. ఆర్‌ఎంపీలందరికీ గుర్తింపు ధృవీకరణ పత్రాలు ప్రభుత్వం వెంటనే ఇవ్వాలని అన్నారు. మధ్యలో అసంపూర్తిగా శిక్షణ పొంది ఆపివేయబడ్డ వారికి పున్ణ శిక్షణ ప్రారంభించాలన్నారు. మారుమూల ప్రాంతాల్లో ప్రథమ చికిత్స అందిస్తున్న కొత్త వారికి కూడా కమ్యూనిటీ పారామెడిక్స్ శిక్షణను వెంటనే ప్రారంభించి, ఆర్‌ఎంపీ కుటుంబాలను ఆదుకోవాలన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆర్‌ఎంపీ, పీఎంపీ సంక్షేమ సంఘం అధ్యక్షులు వెంకన్న తమ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్నోసార్లు విన్నవించారని తెలిపారు. సమావేశంలో వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రకాంత్, ఉపాధ్యక్షులు జి.కిరణ్ కుమార్, కే.కార్యవర్గ సభ్యులు సుధాకర్, పరశురాం యాదవ్, ఎస్కే ఫరీద్, ఎన్.విజయకుమార్, ప్రభుదాస్, పి. సునీల్, రాజన్న అనిల్, సుభాష్ పాల్గొన్నారు.

సర్దార్ రవీందర్‌సింగ్‌ను ఎమ్మెల్సీగా గెలిపించాలి



నవతెలంగాణ-నేరడిగొండ

పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సర్దార్ రవీందర్ సింగ్‌ను ఎమ్మెల్సీగా గెలిపించాలని నాయకులు పెండ్యాల మహేష్ కుమార్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా సర్దార్ రవీందర్ సింగ్ పోటీ చేస్తున్నారని అన్నారు. ఆయనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కరీంనగర్ ఎస్ఆర్ కాలేజీలో చదివి విద్యార్థి అధ్యక్షుడిగా ఎన్నికై స్వతంత్రంగా ఐదుసార్లు కార్పొరేటర్, కరీంనగర్ మేయర్ అయ్యారని అన్నారు. ఆయన చేసిన సేవలను మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు అభినందించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో యువజన నాయకులు అభిషేక్‌గౌడ్, సూర్య ఉన్నారు.

ఆర్థిక సెలవులు మంజూరు చేయాలి

నవతెలంగాణ-కౌటాల



గత సంవత్సరం పార్లమెంట్ ఎన్నికల్లో విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు ఆర్థిక సెలవులు మంజూరు చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు సోయం ఇందురావ్, మండల అధ్యక్షుడు రావుల వినోద్ కోరారు. సోమవారం మండల విద్యాధికారి గావుడే హనుమంతును కలిసి వినతిపత్రం అందించారు. దీనిపై స్పందించిన ఎంఈఓ సాధ్యమైనంత త్వరలో ఉపాధ్యాయులు డ్యూటీ సర్టిఫికెట్లు అందించిన వెంటనే ఉత్తర్వులు జారీ చేస్తానని హామీ ఇచ్చారని వార తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్.అంటోనీ, రత్నం ధర్మయ్య, రాథోడ్ కృష్ణ, రావుజి, బండి తిరుపతి పాల్గొన్నారు.

ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణంలో నాణ్యత పాటించాలి

నవతెలంగాణ-కెరమెరి



ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణంలో నిబంధనల మేరకు నాణ్యత పాటించాలని ఎంపీడీఓ అంజద్ పాషా అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో చేపడుతున్న ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నిర్మాణంలో వాడే మెటీరియల్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. నాణ్యత కలిగిన ఇటుకలను వాడి, సమయానికి వాటర్ క్యూరింగ్ చేయాలన్నారు. ఎంపీడీఓతో పాటు టెక్నికల్ అసిస్టెంట్ అరవింద్ పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో జరగనున్న ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలను అధికారులు సమన్వయంతో పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. సోమవారం అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, ఏఎస్పీ ప్రభాకర్ రావు, ఆర్డీఓ లోకేశ్వరరావులతో కలిసి ఇంటర్ వార్షిక పరీక్షల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 5 నుండి 25 వరకు పరీక్షలు జరుగుతాయని, ఇందుకు జిల్లాలో 19 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని, ప్రథమ, ద్వితీయ సంవత్సరాలు కలిపి మొత్తం దాదాపు 10 వేల మంది విద్యార్థులు హాజరవుతారని తెలిపారు. ప్రతి పరీక్షా కేంద్రంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల ముఖ్య పర్యవేక్షకులు ఇన్విజిలేటర్లకు తగు శిక్షణ ఇవ్వాలని, పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయడంతో పాటు సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసి ఉంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రశ్న, జవాబు పత్రాలను బందోబస్తు మధ్య పరీక్ష కేంద్రాలకు తరలించాలని, విద్యార్థులు పరీక్ష ప్రారంభానికి ముందే సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. జిల్లాలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఇంటర్మీడియట్ పరీక్షలను ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కళ్యాణి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి తుకారాం, విద్యుత్ శాఖ ఎస్ఈ శేషరావు పాల్గొన్నారు.

రేషన్ డీలర్‌పై 6ఏ కేసు నమోదు



నవతెలంగాణ-దహెగాం

ఈ నెల 11న హుడ్కిలి, సిర్పూర్(టి) వద్ద పట్టుబడిన 208 క్వింటాళ్ల రేషన్ బియ్యం అక్రమ రవాణా కేసులో పోలీసులు, టాస్క్ ఫోర్స్, సివిల్ సప్లయ్ విచారణలో రేషన్ డీలర్లను అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. దహెగాం మండలంలోని బీబ్రా గ్రామానికి చెందిన రేషన్ డీలర్ నేరుగా గన్నీ బ్యాగులను తరలిస్తుట్టు వెలుగులోకి రాగా సోమవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ శ్రీనివాస్, మండల ఆర్ఐ శృతితో కలిసి కేసు నమోదు చేశారు. రేషన్ దుకాణాన్ని బినామీగా నడుపుతున్న తణుకు శ్రీనివాస్‌పై బినామీ కేసు, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణలో భాగమైనందుకు ఆథరైజ్డ్ డీలరైన కనక లక్ష్మీపై 6-ఏ కేసు నమోదు చేసి తదుపరి చర్యలకు పై అధికారులకు నివేదిక అందజేసినట్టు పేర్కొన్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లాలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం కలెక్టర్ వెంకటేష్ ధోత్రేకు ఫెడరేషన్ నాయకులు వినతిపత్రం అందించారు. కొన్నేండ్లుగా జర్నలిస్టులు సమస్యలు ఎదుర్కొంటున్న వాటి పరిష్కారానికి ప్రభుత్వాలు కృషి చేయడం లేదని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. ప్రభుత్వాలు మారినా జర్నలిస్టుల సమస్యలు మాత్రం పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు జర్నలిస్టుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినా ఇప్పటివరకు చేసిందేమీ లేదన్నారు. జర్నలిస్టులకు వెంటనే నూతన అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయాలని, హెల్త్ కార్డులు ఇవ్వాలని, పెన్షన్ స్కీమ్ వర్తింపజేయాలని, ఇళ్లు, ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. నిక్కచ్చిగా, నిఖార్సైన వార్తలను రాస్తున్న విలేకరులపై దాడులు పెరుగుతున్నాయని, ఈ దాడుల నివారణకు ప్రత్యేక చట్టం చేయాలని డిమాండ్ చేశారు. చిన్న, మధ్యతరహా పత్రికలకు ప్రభుత్వ గుర్తింపు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు జి.మహేష్, ప్రధాన కార్యదర్శి పర్వతి రాజశేఖర్, జాతీయ కౌన్సిల్ సభ్యులు టి.సురేందర్ రావు, సభ్యులు పి.సంతోష్, పి.నాగేందర్, ఎం.విష్ణు గౌడ్, బి.కిరణ్, ఎం.రవి, కె.శ్రీధర్, చేతన్, కె.సాయి పాల్గొన్నారు.

భారత జట్టు గెలుపు పై సంబరాలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



దుబాయ్‌లో జరుగుతున్న ఛాంపియన్స్ ట్రోఫీలో ఇండియా జట్టు పాకిస్తాన్‌పై గెలిచి సెమీఫైనల్‌కు చేరిన సందర్భంగా జిల్లా కేంద్రంలో బాణాసంచ పేల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీలో ఓటమికి ఇండియా టీం ప్రతీకారం తీర్చుకుందని, సెమీఫైనల్ చేరడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు బోనగిరి సతీష్ బాబు, అభిమానులు సంతోష్, ప్రమోద్, రవీందర్ పాల్గొన్నారు.

అడవిలో అగ్గి పడకుండా అన్ని చర్యలు

- ఫైర్‌లైన్ల ఏర్పాటుతో నివారణ
- పర్యావరణ రక్షణకు అటవీశాఖ కృషి

ఎండలు ముదురుతున్నకొద్ది అడవుల్లో అగ్గి రాజుకుంటోంది. వేసవి కాలంలో అటవీ ప్రాంతంలో పశువులు మేపడానికి వెళ్లినవారు..ఆ ప్రాంతం గుండా వెళ్తున్నవారు బీడీలు, సిగరెట్లు తాగి పడేసిన మంటతో అటవీ ప్రాంతంలో మంటలు చెలరేగి ఆకులు చెట్లు కాలిపోయి వన్యప్రాణులకు హాని జరగడమే కాకుండా పర్యావరణ సమతుల్యం దెబ్బతింటుంది. దీని నుండి రక్షించడానికి అటవీ శాఖ సిబ్బంది ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. డిసెంబర్ నుంచి ఫైర్‌లైన్ల నిర్వహణతో అటవీలో అగ్ని నివారణకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది.



అడవిలో అగ్నిని ఆర్పుతున్న సిబ్బంది(ఫైల్)

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో మొత్తం 11 అటవీ రేంజ్‌లు, రెండు డివిజన్లు ఉన్నాయి. వీటిలో 2445.40 చదరపు కిలోమీటర్ల అటవీ ప్రాంతం ఉంది. ఇతర జిల్లాలతో పోలిస్తే దీనిలో ఎక్కువగా టేకు ఉండడంతో వేసవికాలంలో అగ్గి పడకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నారు. డిసెంబర్ నుండి గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు అడవిలో అగ్గి కనిపిస్తే అందుబాటులో ఫోన్ నెంబర్లు కూడా ఉంచారు.

ఫైర్‌లైన్ల ఏర్పాటుతో పటిష్ట చర్యలు

జిల్లాలోని మొత్తం 243 బీట్‌లలో అటవీ ప్రాంతంలో అగ్గి పడకుండా అటవీ అధికారులు ముందస్తుగా ఫైర్‌లైన్లను ఏర్పాటు చేస్తారు. బ్లోయర్ల సహాయంతో ఆకులు దగ్గరికి చేసి అంటిస్తారు. దీంతో రోడ్డు మీద నుండి ఈ లైన్ దాటి లోపలికి వెళ్లే పరిస్థితులు తక్కువగా ఉంటాయి. ప్రతి సంవత్సరం అటవీ అధికారులు ఈ చర్యలు చేపట్టి కొంత అడవి కాలిపోకుండా చూస్తున్నారు. అగ్గి పడితే వన్యప్రాణులకు నష్టం జరగడమే కాకుండా పర్యావరణ తమ తల్లిత కూడా దెబ్బతింటుందని అధికారులు చెబుతున్నారు.

పర్యావరణ రక్షణకై అటవీశాఖ కృషి

ఫైర్‌లైన్లతో పాటు గతంతో పోలిస్తే అడ్వాన్స్ టెక్నాలజీని వాడి పర్యావరణ రక్షణ కోసం అటవీశాఖ కృషి చేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడ అడవిలో అగ్గి పడ్డ కూడా ఫారెస్ట్ వన్ అగ్ని పోర్టల్ సాటిలైట్ ద్వారా వెంటనే సంబంధిత రేంజ్ కార్యాలయంతో పాటు బీట్ అధికారి మొబైల్‌కు జీపీఎస్ పాయింట్‌తో సంక్షిప్త సందేశం వస్తుంది. దీంతో వెంటనే ఆయా బీట్, సెక్షన్, రేంజ్ అధికారులు అలర్ట్ అయ్యి మంటలు ఆర్పుతున్నారు. దీంతో పర్యావరణానికి ఇబ్బంది కాకుండా అనునిత్యం కృషి చేస్తున్నారు.

గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు

అడవిలో పడే అగ్గికి సంబంధించి గ్రామాల్లో నవంబర్, డిసెంబర్ నుండి అటవీ అధికారులు పెద్ద ఎత్తున వేసవికాలం వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీంతో పాటు పోస్టర్ల ఆవిష్కరణ, వాటిని గ్రామాల్లో అంటించడం ప్రత్యేక మొబైల్ నెంబర్లు గ్రామస్తులకు ఇవ్వడం లాంటి కార్యక్రమాలు చేస్తున్నారు. ఎవరికైనా అడవిలో అగ్గి కనిపిస్తే వెంటనే ఆ నెంబర్లకు ఫోన్ చేసి తెలియజేయాలని కోరుతున్నారు. అలాగే నిధులు అందుబాటులో ఉన్నచోట ఫైర్ వాచర్లను నియమిస్తున్నారు.

అడవిలో అగ్గి పడకుండా ముందస్తు చర్యలు

జ్ఞానేశ్వర్, ఇన్‌చార్జి ఎఫ్ఆర్ఓ, జోడేఘాట్ రేంజ్.



వేసవికాలంలో చెట్ల నుండి పెద్ద ఎత్తున ఆకులు రాలి ఎండిపోయి ఉండడంతో అగ్గిపడే అవకాశం ఎక్కువగా ఉంటుంది. దీంతో పర్యావరణ సమతుల్యం కొంత దెబ్బతింటుంది. ఇలా జరగకుండా ప్రతి బీట్‌లో ఫైర్ లైన్ ఏర్పాటు చేసి అడవిలోకి అగ్గి వెళ్లకుండా చేస్తున్నాం. ప్రజలు కూడా తమకు సహకరించి పశువుల కాపరులు, పాదచారులు బీడీలు తాగడం లాంటివి చేసినప్పుడు అగ్గిపుల్లలు ఆర్పివేయాలి. అలా చేసినప్పుడే పర్యావరణ సమతుల్యత కాపాడే అవకాశం ఉంటుంది. ప్రజలు సహకరించినప్పుడే అడవిలో అగ్గి పడకుండా చూసే అవకాశం ఉంటుంది. ప్రత్యేక సాటిలైట్ ద్వారా ఎప్పటికప్పుడు అగ్ని గుర్తించి ఆర్పడంతో పాటు సిబ్బంది తీసుకోవాల్సిన చర్యలపై ప్రతిరోజు వారికి నిబంధనలు వివరిస్తున్నాం. సాధ్యమైనంత వరకు అడవిలో అగ్గి పడకుండా చూస్తున్నాం.

పోలింగ్ పారదర్శకంగా నిర్వహించాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఈనెల 27న జిల్లాలో జరిగే ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. సోమవారం ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్, అదనపు ప్రిసైడింగ్ అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, ఆర్డీఓ లోకేశ్వర్ రావుతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని తెలిపారు. ప్రిసైడింగ్ అధికారి పోలింగ్ కేంద్రంలో పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగేలా పర్యవేక్షించాలని, ప్రిసైడింగ్ అధికారి డైరీ పై పూర్తిగా అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఈ నెల 26న ఉదయం 9 గంటలకు కలెక్టరేట్ భవనంలో సామాగ్రి పంపిణీ కేంద్రానికి చేరుకోవాలని, సకాలంలో రిపోర్టు చేసి పోలింగ్ ప్రక్రియకు సంబంధించిన సామాగ్రి, బ్యాలెట్ పేపర్, బ్యాలెట్ బాక్సులను పరిశీలించి కేటాయించిన ప్రకారం ఉన్నవాటి వివరాలు సరి చూసి తీసుకోవాలని తెలిపారు. 27న ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ ఉంటుందన్నారు. ఏజెంట్ల సమక్షంలో పోలింగ్ ప్రారంభానికి ముందు, తరువాత బ్యాలెట్ బాక్సులకు సీలు వేయాలన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేసి ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఎన్నికల నిర్వహణ సమర్థవంతంగా చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్లు, ప్రిసైడింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఆర్థిక కార్యకలాపాలపై అవగాహన ఉండాలి

ప్రతి ఒక్కరూ ఆర్థిక కార్యకలాపాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్వర్ రావు, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రాజేశ్వర్ జోషి లతో కలిసి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో కలెక్టరేట్ లోని మహిళా ఉద్యోగులకు నిర్వహించిన ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 2016 నుండి ప్రతి గ్రామంలో, పట్టణంలో ఆర్థిక అక్షరాస్యత పై ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 24వ తేదీ నుండి 28వ తేదీ వరకు నిర్వహించనున్న ఆర్థిక అక్షరాస్యత ఉత్సవాలలో భాగంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని, ముఖ్యంగా మహిళలు పొదుపు విషయంలో చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తారని తెలిపారు. మహిళలు గృహ బడ్జెట్, సూక్ష్మ పొదుపు, శ్రామిక మహిళలు నెలవారి పొదుపు వంటి అంశాలపై దృష్టి సారించాలని, ఆర్థిక కార్యకలాపాలపై అవగాహన కలిగి ఉండి భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా పొదుపు చేయడం అలవాటుగా మార్చుకోవాలని తెలిపారు. అనంతరం ఆర్థిక అక్షరాస్యత ఉత్సవాల సంబంధిత గోడప్రతులను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారాం, అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారి రామకృష్ణ, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజల కోసం ఆలోచించే వారిని ఎన్నుకోవాలి

- ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు

నవతెలంగాణ-సిర్పూర్(టి)

ఈనెల 27న జరిగే ఉమ్మడి ఆదిలాబాద్ కరీంనగర్, మెదక్, నిజామాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రజల కోసం ఆలోచించి చట్టసభలో పోరాటం చేసే వారిని ఎన్నుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నియోజవర్గంలో నేడు అతిథి నాయకులు పర్యటనలు చేసి వారికి ఇష్టమొచ్చినట్టు విమర్శలు చేస్తున్నారని, అలాంటి వారిని నమ్మి మోసపోవద్దన్నారు. బీజేపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి, ఉపాధ్యాయులు ఎమ్మెల్సీ అభ్యర్థి కొమురయ్యలకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప పరిస్థితి అగమ్య గోచరంగా మారిందని, కాంగ్రెస్ పొమ్మంటుందని, బీఆర్ఎస్ వద్దంటుందని, ఈ సందర్భంలో వారిని భారతీయ జనతా పార్టీలోకి ఆహ్వానిస్తున్నామన్నారు. ఆయన అనుభవానికి, వయసుకు సమూచిత గౌరవం కల్పిస్తామన్నారు. నరేంద్ర మోడీ ప్రభుత్వ కృషి వల్ల సాధ్యమైందని తెలిపారు. అలాగే ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ రోడ్ల కోసం నిధులు మంజూరు చేయించడం జరిగిందని, కొన్ని పనులు ప్రారంభమయ్యాయని, కొన్ని పనులు ప్రారంభించాల్సి ఉందని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ సంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షులు నరేందర్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్ రావు, మండల అధ్యక్షురాలు లావణ్య, నీరటి సత్యనారాయణ, ఏల్ములే శంకర్, అశోక్ ఆర్య పాల్గొన్నారు.

కౌటాల : బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని సిర్పూర్ శాసనసభ్యులు డా. పాల్వాయి హరీష్ బాబు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో పలు పాఠశాలలకు వెళ్లి టీచర్స్, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ సంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షులు నరేందర్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ అరిగేలా నాగేశ్వర్ రావు, జిల్లా కార్యదర్శి బండి రాజేందర్ గౌడ్, మండల అధ్యక్షులు కుంచాల విజయ్, మాజీ ఎంపీటీసీ మోతిరాం, బండురావు, మేకల తిరుపతి , మధుకర్, భూమన్న తదితరులు పాల్గొన్నారు.



సిర్పూర్ : విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

చింతలమానేపల్లి : మండలంలోని పలు గ్రామాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా పార్టీ నాయకులతో ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు సమావేశం నిర్వహించారు. బీజేపీ బలపరిచిన అభ్యర్థి గెలుపునకు పాటుపడాలని సూచించారు. మండలంలోని రవీంద్రనగర్, బాబాపూర్, లంబాడిహెట్టి గ్రామాలను సందర్శించి ఆయా గ్రామ సమస్యలు తెలుసుకుని, అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ సంగారెడ్డి మాజీ జిల్లా అధ్యక్షులు నరేందర్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ అరిగేలా నాగేశ్వర్ రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొయ్యాల ఎమ్మాజి, జిల్లా కౌన్సిల్ మెంబర్ ఎల్ములే మల్లయ్య, మండల అధ్యక్షులు రాము, మాజీ సర్పంచ్లు చౌదరి నానయ్య, సుశీల్ మండల్, తుకారాం, సుధాకర్, రంగన్న, మురళి, పురుషోత్తం చారి పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థికి సీపీఐ(ఎం) సంపూర్ణ మద్దతు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డికి సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం దినకర్, కోట శ్రీనివాస్ తెలిపారు. సోమవారం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఉమ్మడి నాలుగు జిల్లాలలో కలిపి గత అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో ఏడుగురు ఎమ్మెల్యేలు, నలుగురు ఎంపీలు గెలిచిన కనీసం నయా పైసా పని కూడా తీసుకురాలేదన్నారు. ఆదిలాబాద్ సీసీఐ ఫ్యాక్టరీ గాని, నిజామాబాద్ పసుపు బోర్డు ఏర్పాటు చేసిన కనీసం రూపాయి కూడా కేటాయించలేదని, నిజామాబాద్ ఆర్మూర్ రైల్వే లైన్, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, కరీంనగర్ కాజీపేట రైల్వే లైన్, ఒక్క నవోదయ, సైనిక్ స్కూల్ తేలేదని ఆరోపించారు. బొగ్గు బ్లాక్లను వేలం వేశారని దుయ్యబట్టారు. ప్రజలకు ఏ ఒక్క మంచి పని కూడా చేయకుండా బీజేపీకి పట్టభద్రులకు ఓటు హక్కు అడిగే అర్హత లేదన్నారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలన్న మోడీ ప్రభుత్వం 15 ఏళ్లలో ఎన్నడూ లేనంతగా నిరుద్యోగం పెరిగిందన్నారు. కుమురం భీం జిల్లాలో సిర్పూర్ నియోజకవర్గం నుంచి గెలిచిన బీజేపీ అభ్యర్థి 100 రోజుల్లో రూ.100 కోట్లు తీసుకొస్తానని ప్రగల్భాలు పలికి ఒక్క రూపాయి అభివృద్ధి పని కూడా చేయలేదని ఆరోపించారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగం, లౌకిక విలువలను కాపాడాలన్న లౌకికశక్తి అయిన కాంగ్రెస్ బలపరుస్తున్న అభ్యర్థి ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు గోడిసెల కార్తీక్, గేడం టికానంద్, కొరెంగా మాలశ్రీ పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్ సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-సిర్పూర్(టి)

కాగజ్‌నగర్ సబ్ డివిజన్ పరిధిలోని కక్షిదారులు రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించేందుకు మార్చి 8న నిర్వహించే లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జూనియర్ సివిల్ కోర్ట్ న్యాయమూర్తి అజయ్ ఉల్లం అన్నారు. సోమవారం జూనియర్ సివిల్ కోర్ట్ ఆవరణలో కాగజ్‌నగర్ సబ్ డివిజన్ పోలీస్ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వివిధ పోలీస్ స్టేషన్‌లో పరిష్కారం కాకుండా పెండింగ్‌లో ఉన్న కేసులను పరిశీలించి కక్షిదారులను పిలిపించి కేసులు పెండింగ్ వల్ల కలిగే నష్టాల గురించి వారికి వివరించాలని సూచించారు. పట్టింపులకు పోకుండా రాజీమార్గమే రాజమార్గంగా ఆలోచించి రాజీకి రావాలని తెలియజేయాలన్నారు. ఈ సమావేశంలో డీఎస్పీ రామానుజం, సీఐ, ఎస్సైలు పాల్గొన్నారు.

ఉద్యమ నాయకుడిని గెలిపించాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉద్యమ నేపథ్యంతో పాటు ఉపాధ్యాయ విద్యారంగ సమస్యలపై స్పష్టమైన అవగాహన అనుభవం కలిగిన నాయకుడు వై.అశోక్ కుమార్‌ని గెలిపించుకోవాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, అధ్యాపకులపై ఉందని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శాంతికుమారి అన్నారు. సోమవారం సంఘం నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి విలేకరులతో మాట్లాడుతూ ఉద్యమాలతో సంబంధం లేని వారు డబ్బు సంచులతో వక్రమార్గాలతో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాన్ని కైవసం చేసుకోవడానికి చూస్తున్నారని ఆరోపించారు. వీరి పట్ల ఉపాధ్యాయులు అప్రమత్తతతో ఉండాలని, విద్యారంగ ఉపాధ్యాయ సమస్యలకోసం నిరంతరం పోరాటాలు చేస్తూ నిజాయితీ నిబద్ధతకు మారు పేరుగా నిలిచిన అశోక్ కుమార్‌ని యూనియన్లు, జెండాలు, ఏజెండాలకు అతీతంగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ సంఘ రాష్ట్ర అధ్యక్షులు మేడి చరణ్దాస్, జిల్లా నాయకులు రాజ కమలాకర్ రెడ్డి, జాడి కేశవ్, తులసి రామ్, మహిపాల్, జిల్లా కమిటీ సభ్యులు హరీష్, బాజీఖాన్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలి



నవతెలంగాణ-వాంకిడి

మండల కేంద్రంలో కాంగ్రెస్ యువజన అధ్యక్షుడు దుర్గం ప్రశాంత్ సోమవారం పార్టీ ఎమ్మెల్సీ ఎమ్మెల్సీ అభ్యర్థి తరపున ప్రచారం నిర్వహించారు. ఉమ్మడి మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థి వుటుకూరి నరేందర్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజాపాలన కొనసాగుతుందని, పట్టభద్రుల సమస్యలు తీరాలంటే కాంగ్రెస్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న నరేందర్ రెడ్డికి విజయం అందించాలని ప్రచారం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ యువ నాయకుడు డోంగ్రీ యుగంత్, నాయకులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
మంగళవారం | ఫిబ్రవరి 25, 2025 | www.navatelangana.com

వేలాలకు వచ్చే భక్తులు బాధ్యతగా వ్యవహరించాలి

● కుందారం సెక్షన్ ఆఫీసర్ భగవంత్ రావు

నవతెలంగాణ-జైపూర్

వేలాల మల్లిఖార్జున స్వామి దర్శనార్థం తరలివచ్చే భక్తులు అగ్ని ప్రమాదాలు జరుగకుండా బాధ్యతగా వ్యవహరించాలని కుందారం సెక్షన్ ఆఫీసర్ భగవంత్ రావు సూచించారు. గట్టుమల్లన్న సన్నిధిలో వంట వార్పు చేసుకునే వారు అగ్ని ప్రమాదాలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. వేసవి ఎండలు ముదురుతున్నందున వంటలు పూర్తయిన వెంటనే మంటలు ఆర్పీవేయడమే కాకుండా పక్క వారు కూడా మంటలు చల్లార్చే విధంగా చూడాలని కోరారు. అదేవిధంగా పశువులు, గొర్రె మేకల కాపర్లు అడవుల్లో బీడీ, సిగరేట్, పొగాకు చుట్టలు అగ్గితో పాటు నిర్లక్ష్యంగా అటవీ ప్రాంతంలో పడవేయరాదని హెచ్చరించారు. అగ్గిని నిర్లక్ష్యం చేస్తే విలువైన అటవీ సంపదను నష్టపోవడం జరుగుతుందని పేర్కొంటూ ఈ విషయంలో ప్రతి ఒక్కరు బాధ్యతగా వ్యవహరించి అడవులు అగ్ని ప్రమాదాలకు గురి కాకుండా సహకరించాలని కోరారు.

ఎస్టీపీపీని సందర్శించిన వివేకవర్ధిని డిగ్రీ కళాశాల విద్యార్థులు

నవతెలంగాణ-జైపూర్



మంచిర్యాల పట్టణానికి చెందిన వివేకవర్ధిని డిగ్రీ కళాశాల విద్యార్థులు సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్‌ను సంధర్శించారు. ఇండస్ట్రీయల్ టూర్‌లో భాగంగా సోమవారం ఎస్టీపీపీకి వచ్చిన విద్యార్థులకు విద్యుత్ ఉత్పత్తి తీరును ఇంజనీర్ మురళి వివరించారు. యూనిట్-1తో పాటు యూనిట్-2 విభాగాలలో రోజు వారి విద్యుత్ ఉత్పత్తి, వాటర్ సోలార్ పవర్ జరేషన్ గురించి వివరించారు. అదేవిధంగా విద్యుత్ ప్లాంట్ నిర్వాహణ, ఉత్పత్తి తీరులో చేపడుతున్న రక్షణ చర్యలు, అకౌంట్ మ్యానేజ్‌మెంట్ తదితర విషయాలను వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ చంద్రమోహన్ గౌడ్ ఉదారి, అధ్యాపకులు షరీనా, చిరంజీవి, తాజ్ బాబాతో పాటు కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోళ్లు చేపట్టాలని రోడ్డెక్కిన రైతులు



నవతెలంగాణ-జైపూర్

పత్తి కొనుగోళ్ల నిలిపివేయడంతో నియోజకవర్గం పరిధి వివిధ ప్రాంతాలకు చెందిన పత్తి రైతులు ఆగ్రహంతో ఆందోళన చేపట్టారు. పత్తి అమ్ముకోవడానికి వచ్చిన రైతులకు జిన్నింగ్ మిల్లులో కొనుగోళ్ల చేపట్టకపోవడం ఆగ్రహానికి గురి చేసింది. వెంటనే పత్తి కొనుగోళ్ల చేపట్టాలని డిమాండ్ చేస్తూ చెన్నూర్ పట్టణం పద్మనగర్ సమీపంలో సోమవారం రోడ్డుపై బైటాయించారు. అదేవిధంగా కిష్టంపేట్ సమీపంలో గల జాతీయ రహదారి-63పై రాస్తా రోకో చేపట్టిన రైతులు కొనుగోళ్ల చేపట్టి నాలుగు రోజులు కాకుండా మరో సారి పత్తి కొనుగోళ్ల నిలివేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. దూర ప్రాంతాల నుంచి పత్తి లోడ్లతో వచ్చి జిన్నింగ్ మిల్లుల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోందని ఆవేధన వ్యక్తం చేశారు. పత్తి నిల్వలు పూర్తయ్యే వరకు కొనుగోళ్ల కొనసాగించాలని డిమాండ్ చేశారు. రాస్తా రోకో అరగంట కొనసాగగా చెన్నూర్, మంచిర్యాల వైపు వాహణాల రాకపోకలు ఎక్కడికక్కడ నిల్చిపోయాయి. విషయం తెల్సుకున్న సీపీఓ సంఘటనా స్థలానికి చేరుకుని రైతులతో మాట్లాడారు. గతంలో కొనుగోళ్ల చేసిన పత్తికి సంబంధించిన టీఆర్‌లు పూర్తి కానందున కొనుగోళ్ల నిలిపివేసినట్లు తెలిపారు. జిల్లా అధికారుల సూచనల మేరకు కొనుగోళ్ల ప్రారంభించుటకు అంగీకరించడంతో రైతులు రాస్తా రోకో విరమించుకున్నారు.

విద్యుత్‌ప్లాంట్ విస్తరణతో ఐదువేల ఉద్యోగావకాశాలు

● ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి

నవతెలంగాణ-జైపూర్



సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్ విస్తరణలో భాగంగా ఏర్పాటు చేస్తున్న 850 మెగావాట్ల ప్లాంట్ ద్వారా అదనంగా ఐదు వేల ఉద్యోగావకాశాలు అందుబాటులోకి రానున్నట్లు చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం మంచిర్యాల జిల్లా పర్యటనకు వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి సభలో ఆయన మాట్లాడుతూ తెలంగాణాలో అధికారాన్ని చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంతర్‌రెడ్డి ఇచ్చిన హామీల మేరకు ఉద్యోగాల భర్తీ కొనసాగుతుందని అన్నారు. అదే క్రమంలో స్థానిక ఎస్టీపీపీ విస్తరణతో కొత్తగా ఉద్యోగావకాశాలు లభించనున్నాయని పేర్కొన్నారు. అదేవిధంగా పేదలైన ఎస్సీ, ఎస్టీ కులాల వారికి ఇంతకు ముందే ఇచ్చిన హామీ మేరకు 18 శాతం ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ కోసం నిధుల కెటాయింపుకు సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ విషయమై అసెంబ్లీలో వెల్లడించడం జరిగిందని ఈ సంధర్భంగా గుర్తు చేశారు. అంతేకాకుండా లెడ్కార్ప్, నేతకానికి కార్పోరేషన్ పునరుద్ధరణ జరుపడం, మాలల కార్పోరేషన్ ఏర్పాటు అనివార్యమని సభా వేధిక మీదుగా వివరించారు.

సీఎంకు స్వాగతం పలికిన ఎమ్మెల్యే వివేక్

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా సోమవారం మంచిర్యాల జిల్లా కేంద్రానికి వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డికి చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి ఘనంగా స్వాగతం పలికారు. హెలీక్యాప్టర్ దిగిన సీఎంకు బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌తో కలిసి శాలువాలతో సన్మానించారు. అదేవిధంగా సీఎం రేవంత్ రెడ్డితో పాటు ప్రచార కార్యక్రమానికి తరలివచ్చిన మంత్రులు శ్రీధర్‌బాబు, సీతక్క, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, ప్రభుత్వ సలహదారు వేణుగోపాల్, ఎమ్మెల్యేలు గడ్డం వినోద్, ప్రేమ్‌సాగర్‌రావు వివేక్ వెంకటస్వామి ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సభా వేధిక ద్వార పిలుపునిచ్చారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీగా ప్రసన్న హరికృష్ణను గెలిపించండి

నవతెలంగాణ-జన్నారం

మెదక్, నిజామాబాద్, అదిలాబాద్, కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి, ఓయూ పూర్వ విద్యార్థి, తెలంగాణ ఉద్యమకారుడు, ప్రసన్న హరికృష్ణను గెలిపించాలని మోకు దెబ్బ అంతర్జాతీయ అధ్యక్షుడు ఎరుకల రాజు గౌడ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో పత్రిక విలేకరులతో మాట్లాడారు. వందలాది కాంపిటీటివ్ ఎగ్జామ్స్ పుస్తకాలు రచించి వేలాది మంది నిరుద్యోగులను పట్టభద్రులను ఉద్యోగులుగా తీర్చిదిద్దిన మేధావి, ప్రసన్న హరికష్ణ అన్నారు. తన 19 సంవత్సరాల అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగ సర్వీస్‌ను వదులుకొని పట్టభద్రుల ఉద్యోగులు, నిరుద్యోగుల గొంతుకగా నిలబడిన బహుజన బిడ్డ ప్రసన్న హరికష్ణను భారీ మెజారిటీతో మొదటి ప్రాధాన్యతగా ఓటు వేసి గెలిపించాలని పట్టభద్రులను కోరుతున్నామన్నారు. రెండు జాతీయ పార్టీలు ఒకే అగ్రవర్ణ ఆధిపత్య కులానికి టికెట్లు కేటాయించి, 90 శాతం జనాభా ఉన్న బీసీ ఎస్సీ, ఎస్టి మైనార్టీ వర్గాలను విస్మరించాయి అన్నారు. రెండు జాతీయ పార్టీలు మద్దతిచ్చిన అభ్యర్థులు కార్పొరేట్ వ్యాపారాలతో ప్రయివేట్ విద్యా సంస్థలను ఏర్పాటు చేసి పేద వర్గాలను ముక్కు పిండి వసూలు చేసిన ఫీజులతో వేల కోట్లు సంపాదించి రాజకీయంగా ఆర్థికంగా సామాజికంగా ఉన్నతంగా బలంగా ఉన్నారన్నారు. కానీ ప్రసన్న హరికృష్ణ మాత్రం ఒక పేదింటి బహుజన బిడ్డ ఎన్నో విపత్కార పరిస్థితులు ఎదురుకొని చదువులో రాణించి అతని జ్ఞానంతో వందలాది పుస్తకాలు రాసి వేలాదిమంది నిరుద్యోగులకూ ఉద్యోగాలు సాధించేలా చేసిన ప్రసన్న హరికృష్ణ మనలో ఒకడు పేదా విద్యార్థుల కష్టాలు తెలిసిన వ్యక్తి కాబట్టి పట్టభద్రుల ఎన్నికల్లో గెలిపించాలని అన్నారు.

బీఆర్ఎస్ నాయకుల ముందసు అరెస్టు

నవతెలంగాణ-జైపూర్

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా సీఎం జిల్లా పర్యటనకు వచ్చిన సందర్భంగా సోమవారం బీఆర్ఎస్ నాయకులను ముందస్తు అరెస్ట్ చేశారు. భీమారం పోలీస్‌స్టేషన్ పరిధి దాంపూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ దాసరి మధునయ్య, దాసరి మనిదీప్‌లతో సహా మరికొందరిని అదుపులోకి తీసుకున్నారు. అదేవిధంగా జైపూర్ పోలీస్‌స్టేషన్ పరిధి వివిధ గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ నేతలను పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు అరెస్ట్ చేసిన వారిలో గ్రామానికి చెందిన మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు పెద్దపల్లి రమేష్, సహా పలువురు నాయకులు బొంగోని జగన్ గౌడ్, మల్లాగౌడ్, దూట రాజశేఖర్‌లను అరెస్ట్ చేశారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలి

● సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి

నవతెలంగాణ- మంచిర్యాల/జైపూర్

రైతులు, పేద కుటుంబాల కడుపుకొట్టి పెద్దలకు పంచుతున్న భారతీయ జనతా పార్టీని ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓడించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి పిలుపునిచ్చారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అదేవిధంగా చెన్నూర్ పట్టణంలో సీపీఐ(ఎం) చెన్నూర్ ఏరియా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడారు. వ్యవసాయ కార్మికులకు గత సంవత్సర బడ్జెట్ కంటే అతి తక్కువగా కెటాయించిన బీజేపీకి ఓట్లతో గుణపాఠం చెప్పాలని అన్నారు. సీపీఐ(ఎం) బలపర్చిన పట్ట భద్రుల అభ్యర్థి వూట్కూరి నరేందర్‌రెడ్డితో పాటు వై అశోక్ కుమార్‌ను గెలిపించాలని పేర్కొన్నారు. గత 15 రోజుల నుండి పత్తి రైతులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపిన ఆయన కేంద్ర ప్రభుత్వం రైతుల జీవితాలతో చెలగాటమాడుతుందని అన్నారు. ఉపాధి కూలీలకు కేంద్ర ప్రభుత్వం అతి తక్కువగా బడ్జెట్ కెటాయించి కూలీలను మరింత పేదలుగా మార్చే ప్రయత్నం చేసిందని తెలిపారు. మూడు పర్యాయాలు కేంద్రంలో అధికారాన్ని చేపట్టిన బీజేపీ కార్మికవర్గ శ్రమను కారు చౌకగా దోపిడి చేసి సంస్థలకు దోచిపెట్టడం కోసం కార్మిక చట్టాలను రద్దు చేసిందని అన్నారు. నిరుద్యోగ యువతకు సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఏడు సంవత్సరాలు గడిచినా ఇవ్వకపోగా ప్రభుత్వ ఖజానాకు కన్నం వేసి కార్మికులను వారి కుటుంబ సభ్యులను వీధిపాలు చేస్తుందని అన్నారు. అమాయకులను అక్రమ కేసుల్లో ఇరికించిన వ్యక్తిని ఎమ్మెల్సీ అభ్యర్థిగా బీజేపీ మంచిర్యాల జిల్లాను ఏవిదంగా చేయాలని భావిస్తోందో అర్థం చేసుకోవాలని అన్నారు. తెలంగాణలో 8 మంది ఎంపీలు, 8 మంది ఎమ్మెల్యేలు ఉన్నా కేంద్ర బడ్జెట్‌లో ఒక్క రూపాయి కూడా రాష్ట్రానికి, మంచిర్యాలకు తీసుకురాలేదని, జనగనణ చేపట్టకుండా అట్టడుగు బలహీణవర్గాలకు తీవ్రంగా అన్యాయం చేస్తున్నారని తెలిపారు. కాగా మంచిర్యాల జిల్లాలోని పట్టభద్రులు, టీచర్లు బీజేపీ అభ్యర్థులను ఓడించగలరని సీపీఐ(ఎం) బలపర్చిన పట్టభద్రుల అభ్యర్థి వూత్కూరి నరేందర్‌రెడ్డి, అశోక్ కుమార్‌ను గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో బోడంకి చందు, దుంపల రజింత్, ఉమారాణి, సిడం సమ్మక్క, బోన్ల సరిత, కుందారం చంద్రన్న, బోగె సత్యం, కరింభీ, రమాదేవి, కృష్ణమాచారి పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి సంకె రవి

కార్మికుల సమస్యలపై పట్టింపేది..?



ఆర్కే-5 గనిపై కార్మికులతో మాట్లాడుతున్న గుల్ల బాలాజీ

నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి కార్మికుల సమస్యలపై యాజమాన్యానికి, గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలకు పట్టింపు లేదని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) శ్రీరాంపూర్ ఏరియా బ్రాంచ్ అధ్యక్షుడు గుల్ల బాలాజీ ఆరోపించారు. సోమవారం ఎస్సీఈయూ ఆధ్వర్యంలో ఆర్కే-5 గనిలో ఫిట్ సెక్రటరీ చిగురు లక్ష్మణ్ అధ్యక్షతన కార్మికులతో మమేకమై ప్రతి డెసిగ్నేషన్ కార్మికుల వద్దకు వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ ఎస్డీఎల్ మిషన్స్ లోడింగ్ వద్ద వాటర్ స్ప్రే చేయడం లేదని, రీ కండిషన్ చేయబడిన డ్రిల్ రాడ్స్ ఇస్తున్నారని, బిట్లు నాణ్యత ఉండటం లేదని అన్నారు. అంతే కాకుండా సరైన చేతి గ్లౌజులు ఇవ్వటం లేదని, లీవులు కూడా సంతకం చేయటం లేదంటు పలు సమస్యలు కార్మికులు తెలిపారన్నారు. అండర్ గ్రౌండ్ మైన్స్ ఫీట్ స్టోర్స్ గత ఐదు ఆరేండ్లుగా పనిచేస్తున్న స్టోర్ ఇష్యు మజ్దూర్ ఖాళీలను భర్తీ చేయాలని కొంతమంది జనరల్ మజ్దూర్‌లు సీఐటీయూ దృష్టికి తీసుకువచ్చి వినతిపత్రం ఇవ్వటం జరిగిందన్నారు. యాజమాన్యం గత 20 సంవత్సరముల నుండి స్టోర్ ఇష్యు మజ్దూర్‌ల ఖాళీలను భర్తీ చేయడం లేదని, కొత్తగా వచ్చిన మహిళా ఉద్యోగులకు అన్ని విధాలుగా ట్రైనింగ్ ఇస్తూ ఖాళీలను భర్తీ చేయాలని చూస్తున్నారన్నారు. కానీ ఎన్నో ఏళ్ల నుండి యాక్టింగ్‌లో చేస్తున్న కార్మికులకు మొండి చేయి చూపెడుతున్నారని, ఇప్పటికైనా యాజమాన్యం, గుర్తింపు సంఘం పెండింగ్‌లో ఉన్న యాక్టింగ్ ఖాళీలతో పాటు స్టోర్ ఇష్యు మజ్దూర్ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ నాయకులు మిడివెల్లి శ్రీనివాస్, కస్తూరి చంద్రశేఖర్, వెంగళ శ్రీనివాస్, తిరుపతి, బందు శ్రీను, సురేందర్ పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

● టీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి

నవతెలంగాణ-నస్పూర్

జర్నలిస్టుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని టీడబ్ల్యూజేఎఫ్ నాయకులు కలెక్టర్ కార్యాలయంలోని ఏఓ రాజేశ్వరరావుకు సోమవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో జర్నలిస్టుల పరిస్థితులు దారుణంగా మారాయని, అనేక ఒడిదుడుకుల మధ్య వృత్తిబాధ్యతలు నిర్వహిస్తున్నారన్నారు. చాలీచాలని వేతనాలతో బతుకులీడుస్తున్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉండే మీడియాను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని, కనీస సమస్యలను పరిష్కరించకుండా ఏండ్ల తరబడి జాప్యం చేస్తున్నాయన్నారు. ఇండ్ల స్థలాల విషయంలో సర్కారు ప్రత్యేక చొరవ చూపాలని, కొత్త ఆరోగ్య బీమా పథకాన్ని ప్రవేశపెట్టాలని, ఉద్యోగుల మాదిరిగా అమలుచేయాలని, జర్నలిస్టుల కంట్రిబ్యూషన్‌ను ప్రభుత్వమే భరించాలని, ప్రయివేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో అమలయ్యేలా చొరవ తీసుకోవాలన్నారు. కొత్త అక్రిడిటేషన్ కార్డులను అందజేయడంలో మీడియా అకాడమీ విఫలమైదన్నారు. వెంటనే అర్హులైన జర్నలిస్టులందరికీ కొత్త కార్డులివ్వాలని, ఇతర రాష్ట్రాల్లో మాదిరిగా రిటైర్డ్ అయిన జర్నలిస్టులకు పెన్షన్ పథకాన్ని అమలుచేయాలని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా ప్రత్యేక రక్షణ చట్టాన్ని తీసుకురావాలన్నారు. మహిళా జర్నలిస్టులకు పనిచేసే కార్యాలయం నుంచి ఇంటి వరకు రాత్రి పూట రవాణా సదుపాయం కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ నాయకులు సాగర్, మధుసూదన్, లక్ష్మణ్, జీవన్ బాబు, శేఖర్, సమ్మయ్య పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో ఏఓకు వినతి పత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

దుబ్బపల్లి గ్రామస్తులకు న్యాయం చేయాలి



నవతెలంగాణ-జైపూర్

కమీషన్ల కోసం కక్కుర్తిపడి స్థానికేతరులకు లబ్ది చేకూర్చడం కోసం అర్హులైన వారికి జరుగుతున్న అన్యాయాన్ని అధికారులు గుర్తించాలని రామారావుపేట్ గ్రామ పంచాయతీ దుబ్బపల్లి గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శ్రీరాంపూర్ ఓపెన్‌కాస్ట్ గని విస్తరణలో భాగంగా దుబ్బపల్లి గ్రామాన్ని ఖాళీ చేయించడం కోసం రెవెన్యూ అధికారులతో కలిసి సింగరేణి యాజమాన్యం చేపట్టిన సర్వేలో అనర్హులకు పెద్దపీట వేశారని సోమవారం విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు. దుబ్బపల్లి గ్రామానికి సంబంధించి వెలువడుతున్న వార్త కథనాల పట్ల అసంతృప్తి వ్యక్తం చేసిన గ్రామస్థులు కమిటీ సభ్యుల కనుసన్నల్లో తయారు చేసిన లిస్టులో అర్హులైన వారికి అవకాశం లేకుండా పోయిందని ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. రెవెన్యూ సింగరేణి అధికారులు సంయుక్తంగా చేపట్టిన సర్వే ద్వారా తయారు చేసిన నివేధికలో స్థానికులైన వారికి అవకాశం దక్కకపోవడంతో అధికారులకు పిర్యాదు చేయడం జరిగిందని తెలిపారు. కమిటీ పేరుతో డబ్బుల వసూలును వ్యతిరేకించిన కారణంగా మా పేర్లు రాకుండా ఇతర ప్రాంతాల వారికి అవాకశం కల్పించారని అన్నారు. మాదిగలకు ఇనామ్‌గా ఇచ్చినటువంటి భూమిలో మాకు తెలియకుండా ఇతరులు ఇండ్లు నిర్మించుకున్నారని తెలిపారు. అంతే కాకుండా వారి బంధువులైనటువంటి వారు, వారి శ్రేయోభిలాషులకు ఇండ్లు కట్టించి వారికి లబ్ది చేకూరేవిధంగా ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మల్లేష్, కామెర రాజమల్లు, చిప్పకుర్తి పున్నం బాపు, తుంగపిండి రాజం, కామెర రమేష్, జుమ్మిడి స్వామి పాల్గొన్నారు.

కుందారం అటవీ ప్రాంతంలో పెద్దపులి

నవతెలంగాణ-జైపూర్

మంచిర్యాల డివిజన్ కుందారం అటవీ ప్రాంతానికి పెద్దపులి చేరుకున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. కుందారం అటవీ ప్రాంతం మీదుగా ఉన్నటువంటి రోడ్డులో పెద్దపులి అడుగులను సోమవారం అధికారులు గుర్తించారు. ఎఫ్‌బీఓ శ్రీధర్, ఎఫ్‌ఎస్ఓ సాయికిరణ్‌తో కలిసి స్థానిక సెక్షన్ ఆఫీసర్ భగవంత్ రావు పులి కదలికలు గుర్తిస్తూ పులి సంచారంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా సిబ్బందితో కలిసి పర్యవేక్షిస్తున్నారు. కాగా బీ1గా చెపుతున్న ఈ పెద్దపులి బెజ్జూర్ నుండి నెన్నెల మీదుగా దాంపూర్ అటవీ ప్రాంతానికి వచ్చి అక్కడి నుండి కుందారం రక్షిత అటవీ ప్రాంతానికి చేరుకున్నట్లు తెలిపారు. దాంపూర్ ఏరియాలో సంచరించి అక్కడ ఒక బర్రెదూడపై దాడి చేసి చంపిన పెద్దపులి రెండు రోజుల పాటు దాంపూర్ ఏరియాలోని సంచరించింది. శనివారం జైపూర్ ఏరియాకు వచ్చి పెగడపల్లి శివారు అటవీ ప్రాంతం మీదుగా కుందారం రక్షిత అటవీ ప్రాంతంలోకి వచ్చిందని పేర్కొంటున్నారు.

సరిహద్దు గ్రామాల వారు అప్రమత్తంగా ఉండాలి : రేంజ్ ఆఫీసర్ రత్నాకర్ రావు

దాంపూర్ ఏరియా నుంచి కుందారం ఏరియాలో ప్రవేశించిన పెద్దపులి పట్ల సరిహద్దు గ్రామాల వారు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఎలాంటి అసరమైనా అడవుల వైపు ఎవ్వరు కూడా వెల్లవద్దని హెచ్చరించారు. మరీ ముఖ్యంగా పశువులు, గొర్రె మేకల కాపర్లు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అదేవిధంగా అటవీ సరిహద్దుల్లో గల పంట పొలాల వైపు పగటి పూట ఇద్దరు ముగ్గురు కలిసి వెల్లి చీకటి సూర్యాస్తమయంలో లోపు ఇల్లు చేరాలని పేర్కొన్నారు. రక్షిత అటవీ ప్రాంతంలో సంచరిస్తున్న పులికి ఎలాంటి హానికర పరిస్థితులు చేపట్టరాదని ఈ సందర్భంగా హెచ్చరించారు.

కుందారం అటవీ ప్రాంతానికి ఎవరూ వెళ్లొద్దు

● టీజీఎఫ్‌డీసీ రేంజ్ ప్లాంటేషన్ మేనేజర్ సురేష్



నవతెలంగాణ-జైపూర్

మంచిర్యాల డివిజన్ కుందారం అటవీ ప్రాంతంలో పెద్దపులి సంచరిస్తున్నట్లు తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ మంచిర్యాల రేంజ్ ప్లాంటేషన్ మేనేజర్ గోగు సురేష్ తెలిపారు. కుందారం నీలగిరి ప్లాంటేషన్‌లో సోమవారం పెద్దపులి పాద ముద్రలు గుర్తించినట్లు పేర్కొన్నారు. జైపూర్ క్రాస్ రోడ్డు నుండి ఆరెపల్లి ఘాట్ రోడ్డు మీదుగా కుందారం వైపు పులి ప్రయాణించినట్లు తెలిపారు. ఆరెపల్లి ఘాట్ రోడ్డు మీదుగా కుందారం అటవీ ప్రాంతానికి ఎవ్వరు వెల్లకూడదని తెలిపిన ఆయన సరిహద్దు గ్రామాల వారు జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. కాగా పులికి ఎలాంటి అపాయం కలుగకుండగా రక్షణ చర్యలు చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

మండల నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-జన్నారం



మండల పంచాయతీ కార్యదర్శుల ఫోరం మండల కమిటీని సోమవారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కె విశ్వశ్రీ, ప్రధాన కార్యదర్శిగా ఎం శ్రీకాంత్, క్యాషియర్‌గా ఏ జంగు, అసోసియేటెడ్ ప్రెసిడెంట్‌గా ఏ రమేష్, అంజన్న, విజయ్ రావు, వరలక్ష్మి జలంధర్, గోపీచంద్ నాయక్, ఆర్గనైజింగ్ సెక్రటేరియర్లుగా, భాగ్య రావు, డి. లత, సంతోష్, సురేష్, జాయింట్ సెక్రటరీగా ఎస్ రమేష్‌ఎం, లావణ్య, టి మధుకర్ కళ్యాణి, క్రీడా కార్యదర్శిలుగా శ్రీ పాల్ రజిత మీడియా కార్యదర్శిగా కరుణ కార్యవర్గ సభ్యులుగా సరితా, శ్రీనివాస్, మధు రాహుల్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ జలంధర్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఉమర్ షరీఫ్, జిల్లా ప్రధాన కార్యదర్శి లకావత్ శ్రీనివాస్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ చంద్రమౌళి, ఈసీ మెంబర్ మధు పాల్గొన్నారు.

పట్టభద్రులకు ఓటర్ స్లిప్పులు పంపిణీ

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని అన్ని పట్టభద్రులకు మండల అధికారులు ఓటర్ స్లిప్పులను పంపిణీ చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో సోమవారం మండలంలోని తిమ్మాపూర్, కమాన్‌పల్లి, దేవునిగూడా గ్రామాల్లో ఉన్న పట్టభద్రులకు మండల ఆర్ భానుచందర్, తిమ్మాపూర్‌లో వీఎల్ఓ చిందం శ్రీనివాస్, ఓటర్ స్లిప్పులు పంపిణీ చేశారు. 27న జరిగే పోలింగ్‌లో పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

వేతనంతో కూడిన సెలవును ప్రకటించాలి

నవతెలంగాణ-నస్పూర్

ఉమ్మడి అదిలాబాద్, కరీంనగర్, మెదక్, నిజామాబాద్ పట్టబద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు వేతనంతో కూడిన సెలవును సింగరేణి యాజమాన్యం ప్రకటించాలని హెచ్ఎంఎస్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ తిప్పారపు సారయ్య, బ్రాంచ్ కార్యదర్శి అనిల్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఓటు హక్కు మన అందరి బాధ్యత, భారత రాజ్యాంగం ప్రకారం ఓటు హక్కును ప్రతి ఒక్క పౌరుడు వినియోగించుకోవాలని అన్నారు. ఎలక్షన్ కమిషన్ గైడెన్స్ ప్రకారం ప్రభుత్వ, ప్రయివేట్ పరిశ్రమలో కార్యాలయాల్లో సెలవు ప్రకటించిన విధంగా, సింగరేణి ఉద్యోగులకు కూడా వేతనంతో కూడిన సెలవును ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

బాధిత కుటుంబాలను పరామర్శించిన ఏమాజి

నవతెలంగాణ-తాండూర్



ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన బాధిత కుటుంబాలను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొయ్యల ఏమాజీ, జిల్లా ఉపాధ్యక్షుడు పులగం తిరుపతి, సీనియర్ నాయకులు కేశవరెడ్డి, జిల్లా కార్యదర్శి గోవర్ధన్ సోమవారం పరామర్శించారు. ఇటీవల తాండూరు మండలం రేపల్లెవాడ గ్రామానికి చెందిన కళావతి, మాదారం ఎంవికె 5 గ్రామానికి చెందిన కోట సాయి రోడ్డు ప్రమాదాల్లో చనిపోయారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొయ్యల ఏమాజి ఆధ్వర్యంలో బాధిత కుటుంబాలను పరార్శించి ఓదార్చారు. వారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని ఏమాజీ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు నర్సింగ్ పాల్గొన్నారు.

గోదావరి నది ఒడ్డున నాగులమ్మ విగ్రహా ప్రతిష్ట

నవతెలంగాణ-జైపూర్

జైపూర్ మండలం టేకుమట్ల గ్రామ శివారు గోదావరి నది ఒడ్డును నాగులమ్మ విగ్రహాన్ని ప్రతిష్టించారు. గ్రమానికి చెందిన రాగం కృష్ణవేణి-కొమురయ్య దంపతులు స్వంత డబ్బులు ఖర్చు చేసి విగ్రహా ప్రతిష్టకు సహకరించారు. విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో ఇందారం ఓపన్‌కాస్ట్ గని ప్రాజెక్టు ఆఫీసర్ వెంకటేశ్వర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ పరిధి మాజీ సర్పంచులు, ఎంటీసీ సభ్యులు, భక్తులు అత్యధికంగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆర్టీసీ అభివృద్ధికి సిబ్బంది కృషి చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ఆర్టీసీ సంస్థ అభివృద్ధికి అన్ని విభాగాల సిబ్బంది సమన్వయంతో కృషి చేయాలని రీజినల్ మేనేజర్ సోలోమాన్ అన్నారు. డిపో ఆవరణలో వారం రోజులుగా సిబ్బంది అందజేస్తున్న పవర్ శిక్షణ కార్యక్రమాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న మెలుకువలను సిబ్బంది పాటించాలని సూచించారు. ప్రమాదాలు జరగకుండా అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని వివరించారు. ప్రయాణికుల పట్ల మర్యాదపూర్వకంగా మెదగాలని తెలిపారు. డిపో పరిధిలో ఖర్చులను తగ్గించడంతో పాటు కేఎంపీఎల్ పెంచాలన్నారు. ఈ సందర్భంగా శిక్షణలో భాగంగా నిర్వహించిన ఆటల పోటీలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ విశ్వనాథ్, డిపో సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

పురుగులమందు తాగి యువతి ఆత్మహత్య

నవతెలంగాణ-రెబ్బెన

మండలంలోని గోలేటి గ్రామపంచాయతీ పరిధిలోని రేకులగూడా గ్రామానికి చెందిన చింతకుంట్ల సంధ్య (22) పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు. గ్రామంలో నివాసముంటున్న చింతకుంట్ల పోషంకు నలుగురు కుమార్తెలు, కొడుకు ఉన్నారు. పెద్ద కూతురు సంధ్య కూలీ పనులు చేస్తూ జీవిస్తూ ఉండేది. 22 సంవత్సరాలు వచ్చిన రసజ్వల కాలేదని తరచు కుటుంబ సభ్యులతో చెబుతూ బాధపడుతూ ఉండేది. కుటుంబ సభ్యులు ధైర్యం చెబుతూ ఉండేవారు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి తీవ్ర మనోవేదనకు గురై పురుగుల మందు తాడి వాంతులు చేసుకోగా గమనించిన కుటుంబ సభ్యులు ఆరా తీశారు. పురుగులమందు తాగనని చెప్పటంతో రెబ్బెన ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రథమ చికిత్స అందించినంతరం బెల్లంపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి మృతి చెందినట్లు నిర్ధారించారు. సంధ్య తండ్రి పోచం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఎలాంటి పత్రాలు లేని నగదు పట్టివేత

నవతెలంగాణ-కుభీర్



మండలంలోని సిరిపెల్లి చెక్ పోస్ట్ వద్ద అక్రమంగా తరలిస్తున్న రూ.54,000 నగదును పట్టుకున్నామని ఎస్సై రవీందర్ తెలిపారు. పాలజ్ నుంచి కుబీర్‌కు వస్తున్నా అశోక్ అనే వ్యక్తి వద్ద ఎలాంటి పత్రాలు లేకపోవడంతో వాటిని స్వాధీనం చేసుకున్నామని వివరించారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి పత్రాలు లేకుండా నగదును తరలిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.

విశ్రాంత జీవితాన్ని ఆనందంగా గడపాలి



నవతెలంగాణ-రెబ్బెన

పీఆడ్‌పీ డైరెక్టర్ వెంకటేశ్వర్ రెడ్డి విశ్రాంత జీవితాన్ని ఆనందంగా గడపాలని బెల్లంపల్లి ఏరియా జీఎం విజయభాస్కర్ రెడ్డి అన్నారు. సోమవారం ఆయనకు బెల్లంపల్లి ఏరియాలోని ఆఫీసర్స్ క్లబ్‌లో ఉద్యోగ విరామణ ఆత్మీయ వీడ్కోలు సందర్భంగా బెల్లంపల్లి ఏరియా అధికారులు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఆయనతో ఉన్న అనుభందాన్ని అధికారులు పంచుకున్నారు. కార్యక్రమమంలో సీఎంఓఏఐ ప్రెసిడెంట్, పీఓ నరేందర్, ఎస్ఓటూజీఎం రాజమల్లు, క్లబ్ సెక్రటరీ వీరన్న, డీజీఎం(ఐఈ) బెహరా, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి పాల్గొన్నారు.

నేటి జాబ్ మేళా వాయిదా

నవతెలంగాణ-ఆసిఫాబాద్

నేడు జిల్లా కేంద్రంలోని ప్రేమల గార్డెన్‌లో నిర్వహించే జాబ్ మేళాను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు ఎమ్మెల్యే కోవలక్ష్మీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి కొంతమంది నాయకులు తట్టుకోలేకపోతున్నారని, ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ సాకు చెబుతూ జాబ్ మేళాకు అడ్డు తగులుతున్నారని తెలిపారు. ప్రస్తుతానికి తాత్కాలికంగా వాయిదా వేస్తున్నామని, త్వరలోనే మళ్లీ తేదీలు ప్రకటిస్తామని పేర్కొన్నారు.

కళాశాలలో వీడ్కోలు సమావేశం



నవతెలంగాణ-కుభీర్

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ప్రథమ సంవత్సరం విద్యార్థులు ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ సునీల్ కుమార్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. మార్చిలో నిర్వహించే వార్షిక పరీక్షలకు విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి కళాశాలకు, విద్యార్థుల తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. అదే విధంగా కళాశాలకు ఎంతో విలువైన భూమి దానం చేసిన భూదాత దొంతుల లింగన్నను సన్మాంచారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి, నృత్యాలు చేసి పలువురిని ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు విజయ్ భాస్కర్, సంపత్, హనుమంత్‌రావు శేఖర్, నర్సయ్య, శ్రీనివాస్, రమేష్, మాధవి, అశోక్, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు రాయితీ బస్ పాసుల అందజేత



నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

సోన్ గ్రామపంచాయతీ పరిధిలో అర్హులైన 20 మంది దివ్యాంగులకు ప్రయాణంలో 50శాతం రాయితీతో కూడిన బస్ పాసులను ఆర్టీసీ బస్‌పాస్ ఇన్‌చార్జ్ ఎస్.రమేష్ అందజేశారు. ఈ పాస్‌లు ఉన్న దివ్యాంగులు పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, డీలక్స్ బస్సులలో ప్రయాణంలో 50శాతం రాయితీతో ప్రయాణించవచ్చని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సోన్ మండల దివ్యాంగుల అధ్యక్షులు యాదగిరి, లింగన్న, మాదాపూర్ మహేందర్ పాల్గొన్నారు.

శివరాత్రికి ముస్తాబవుతున్న ఆలయాలు

నవతెలంగాణ-కుభీర్

ప్రతి సంవత్సరం నిర్వహించే శివరాత్రి వేడుకలకు ఆలయాలు ముస్తాబవుతున్నాయి. అందులో భాగంగానే మండలంలోని పార్డి(బి) గ్రామంలోని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శ్రీరాజరాజేశ్వర ఆలయాన్ని రంగులు వేసి, విద్యుత్ కాంతులతో అలంకరించారు. ఈ వేడుకలు ఐదు రోజుల పాటు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ అధ్యక్షులు మోహన్ తెలిపారు. ఈనెల 26 నుంచి జాతర 27న ఉదయం శ్రీరాజరాజేశ్వరునికి ప్రత్యేక పూజలు చేసి, అదే రాత్రి 12 గంటలకు శివ పార్వతుల పెండ్లి అంగరంగా వైభోగంగా జరిపించనున్నట్టు తెలిపారు. 28న భక్తులు అభిషేకలు, అర్చనలు మార్చ్ 1న రాజరాజేశ్వరునికి సాయంత్రం గ్రామంలో ఉన్న ప్రతి ఇంటి నుంచి అంబలి నైవేద్యం నెత్తిన పెట్టుకొని ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేస్తారు. 2న మధ్యాహ్నం ఒంటి గంటకు కుస్తీ పోటీలు నిర్వహించి, అదే రోజు రాత్రి 12గంటలకు శివపార్వతుల నాగవెల్లి కార్యక్రమాలు జరిపిన తరవాత జాతర కార్యక్రమాలు ముగుస్తాయి. ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు అన్ని ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. ఇక్కడ రాజరాజేశ్వరుని పెండ్లి చేసిన తరువాతనే గ్రామంలో ఎదైనా శుభకార్యాలు చేపట్టడం ఇక్కడి ప్రజల ఆచారమని తెలిపారు.

ఆరోపణలు.. ప్రత్యారోపణలు..!

- వేడెక్కుతున్న సిర్పూరు రాజకీయం

నవతెలంగాణ-కాగజ్‌నగర్



సిర్పూరు నియోజకవర్గంలో రాజకీయాలు వేడెక్కుతున్నాయి. ఇపుడు ఎన్నికలు లేకపోయినా రేపో మాపో ఎన్నికలు ఉన్నాయనే విధంగా నియోజకవర్గంలో నాయకులు ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకుంటున్నారు. దీనితో ఇక్కడి రాజకీయాల పట్ల సర్వత్రా ఆసక్తి నెలకొంటోంది. సిర్పూరు నియోజకవర్గంలో ప్రస్తుతం అన్ని పార్టీల నాయకులు బలంగానే ఉన్నారు. గతంలో నాయకులున్నా ఎన్నికలు వచ్చేసరికి పోటీ ఇద్దరు లేదా ముగ్గురు నాయకుల మధ్యే నెలకొని ఉండేది. కాని మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఇపుడు నలుగురైదుగురు నాయకులు నియోజకవర్గంలో బలంగా తయారయ్యారు. దీనితో ఈ నాయకులు ప్రతీ రోజు నియోజకవర్గంలో పర్యటిస్తూ ఇతర నాయకులపై ఆరోపణలు చేస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికలలో బహుజన సమాజ్ పార్టీ నుండి పోటీ చేసిన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రస్తుతం బీఆర్ఎస్‌లో ఉన్నారు. బీఆర్ఎస్ నుండి పోటీ చేసిన కోనేరు కోనప్ప ప్రస్తుతం కాంగ్రెస్‌లో ఉండగా, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దండె విఠల్ కూడా ప్రస్తుతం కాంగ్రెస్‌లో కొనసాగుతున్నారు. గత ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ నుండి పోటీ చేసిన రావి శ్రీనివాస్ కూడా ప్రస్తుతం కాంగ్రెస్‌లోనే ఉన్నారు. బీజేపీ నుండి పోటీ చేసిన హరీష్‌బాబు ఎమ్మెల్యేగా గెలుపొందారు. ప్రస్తుతం ఈ నాయకులంతా నియోజకవర్గంలో పర్యటిస్తూ ఒకరిపై ఒకరు ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకుంటున్నారు. బీఆర్ఎస్ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ నియోజకవర్గంలో పర్యటిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వ లోపాలను ఎత్తి చూపుతూ కాంగ్రెస్ పార్టీని విమర్శిస్తున్నారు. ముఖ్యంగా మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప హయాంలో జరిగిన అవినీతిని ఆయన ప్రశ్నిస్తున్నారు. మరోవైపు మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప కూడా ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మరీ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తీరును ఎండగట్టారు. తాను అవినీతికి పాల్పడ్డట్లు రుజువు చేయాలని సవాల్ చేశారు. ఇంకోవైపు ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు కూడా సోమవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్పతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వ తీరును ఎండగట్టారు. ప్రస్తుతం ఏ పార్టీలో ఉన్నాడో తెలియని కోనేరు కోనప్పకు అన్ని పార్టీల దారులు మూసుకుపోయాయని, బీజేపీలోకి వస్తే తాము సాదరంగా ఆహ్వానిస్తామని ఆయన వ్యాఖ్యానించడం ఇక్కడ గమనార్హం. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలోకి వెళ్లే ఆనవాయితీ కోనేరు కోనప్పకు ఉందని, రాబోయేది బీజేపీ ప్రభుత్వమే కాబట్టి ముందే తమ పార్టీలోకి వస్తే అందరం కలిసి పార్టీని అభివృద్ధి చేసుకోవచ్చని ఆయన సూచించారు. ఈ నాయకులు ఆరోపణలు, ప్రత్యారోపణలు ఇపుడు నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారుతున్నాయి.

పోలింగ్ ప్రక్రియపై అవగాహన ఉండాలి



పోస్టల్ బ్యాలెట్ ఓట్ల వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఈ నెల 27న చేపట్టనున్న పోలింగ్ ప్రక్రియపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ రాజర్షి షా సూచించారు. సోమవారం మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ పట్టభద్రుల, ఉపాధ్యాయ నియోజకవర్గ శాసన మండలి ఎన్నికల సందర్భంగా పోలింగ్ సిబ్బందికి జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన రెండవ విడత శిక్షణా తరగతులలో పాల్గొన్నారు. అలాగే కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఎన్నికల విధులలో కేటాయించబడిన సిబ్బంది తమ ఓటును ఉపయోగించుకుంటున్న తీరును పరిశీలించారు. అనంతరం ఎన్నికల సందర్భంగా పోలింగ్ సిబ్బందికి కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన మైక్రో అబ్జర్వర్స్ శిక్షణా తరగతులలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 27 వ తేదీన ఉదయం 8.00 గంటల నుండి సాయంత్రం 4.00 గంటల వరకు పోలింగ్ సమయం ఉంటుందని తెలిపారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ ప్రక్రియను సజావుగా ప్రశాంత వాతావరణంలో సమర్థవంతంగా ఎన్నికల నిర్వహణలో కేటాయించిన విధులను బాధ్యతగా నిర్వహించాలని పేర్కొన్నారు. జిల్లాలో 28 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించడం జరిగిందన్నారు. మైక్రో అబ్జర్వర్లు పోలింగ్ విధానాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలన్నరు. గ్రాడ్యుయేట్ ఓటర్స్ పోస్టల్ బ్యాలెట్‌లో 96 మందిలో 62 మంది సోమవారం తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు పేర్కొన్నారు. మాస్టర్ ట్రైనర్లు రాజేశ్వర్, జగన్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలా దేవి, సబ్ కలెక్టర్ యువరాజ్, ట్రైనీ కలెక్టర్ అభిగ్యాన్, తహసీల్దార్ శ్రీనివాస్, ఏఓ రామిరెడ్డి, పీఓలు, ఏపీఓలు, అబ్జర్వర్లు పాల్గొన్నారు.

జీఎంగా విజయభాస్కర్ బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి ఏరియాకి నూతనంగా నియమితులైన విజయ భాస్కర్ రెడ్డి జీఎంగా బాధ్యతలను స్వీకరించారు. అధికార ప్రతినిధి రెడ్డిమళ్ల తిరుపతి, అధికారులు, సిబ్బంది ఆయనను శాలువతో సత్కరించి స్వాగతం పలికారు. అనంతరం ఏరియాలోని స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం రాజమళ్లు, ఖైరిగూర పీఓ ఎం.నరేందర్, ఏరియా సెక్యూరిటీ అధికారి ఉమాకాంత్, విభాగాల అధిపతులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జీఎంను సన్మానించిన ఏఐటీయూసీ నాయకులు

బెల్లంపల్లి ఏరియా గోలేటి నూతన జీఎంగా బాధ్యతలు స్వీకరించిన విజయ భాస్కర్ రెడ్డిని ఏఐటీయూసీ సింగరేణి కాలరీస్ వర్కర్స్ గోలేటి బ్రాంచ్ కార్యదర్శి ఎస్.తిరుపతి, ఉపాధ్యక్షులు బయ్య మొగిలి ఆధ్వర్యంలో పుష్పగుచ్ఛమిచ్చే శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఏరియా పలు సమస్యలను ఆయనకు తెలియజేస్తూ పరిచయం చేసుకున్నారు. సమస్యల పరిష్కరంలో తన వంతు సహకారం అందిస్తానని ఈ సందర్భంగా జీఎం అన్నారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీలు శేషు, జగ్గయ్య, జూపాక రాజేష్, కే.కిరణ్ బాబు, మీసా చంద్రశేఖర్, డి.దివాకర్, డి.రాజయ్య, మారం శ్రీనివాస్, ఎంబటి రామయ్య, కోడం అశోక్, సుమిత్ర, శైలజ, మాయ పాల్గొన్నారు.



జీఎంను సన్మానించి మొక్క బహుకరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

'ఇండిపెండెంట్‌గా గెలిచిన తర్వాతే పార్టీలో చేరుతా'

- సిర్పూరు బిడ్డలే నా పార్టీ
- వారి ఆశీర్వాదం ఎపుడూ నా వెన్నంటే ఉంటుంది
- మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

నవతెలంగాణ-కాగజ్‌నగర్

తాను ఇండిపెండెంట్‌గా గెలిచిన తర్వాతే ఏదైనా పార్టీలో చేరుతాను తప్ప ముందుగా ఏ పార్టీలో చేరేది లేదని సిర్పూరు మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప స్పష్టం చేశారు. సోమవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తన పట్ల చేసిన వ్యాఖ్యల పట్ల కోనేరు కోనప్ప తీవ్రంగా మండిపడ్డారు. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తనను వలసవాది అని, రౌడీ అని, అవినీతిపరుడని విమర్శిస్తున్నాడని, ఇది సరికాదని అన్నారు. సిర్పూరు నియోజకవర్గంలో వేలాది మంది ఇతర రాష్ట్రాల నుండి వచ్చిన వారు ఉన్నారని, వారంతా వలసవాదులే అవుతారా అని ప్రశ్నించారు. గత ఎన్నికల సమయంలో బీఎస్పీ నుండి పోటీ చేసిన ఆర్ఎస్పీ ఆ సమయంలో కేసీఆర్ కుటుంబాన్ని ఎలా దూషించాడో ప్రజలందరికీ తెలుసని, దీనికి సంబంధించిన 368 వీడియోలు తన వద్ద ఉన్నాయని అన్నారు. బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు ఆ పార్టీ నాయకులే ఇక్కడ ప్రచారం చేసుకున్నారే తప్ప నేను ఏ నాయకుడిని కలువలేదని స్పష్టం చేశారు. టిక్కెట్‌ల కోసం ఏ పార్టీ వద్దకు వెళ్లి అడుక్కునే పరిస్థితుల్లో నేను లేనని, నా టిక్కెట్ నా జేబులోనే ఉందని అన్నారు. సిర్పూరు బిడ్డలే నా పార్టీ అని, వారి ఆశీర్వాదంతోనే ఇండిపెండెంట్‌గా గెలిచి నా సత్తా ఏమిటో చూపిస్తానని అన్నారు. మరోసారి నా పట్ల అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని ఆయన హెచ్చరించారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రచార సభలలో కేసీఆర్ కుటుంబాన్ని దూషిస్తూ మాట్లాడిన వీడియోలను ఆయన టీవీ స్క్రీన్‌పై విలేకరులకు చూపిస్తూ మాట్లాడారు.

అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డిని గెలిపించాలి

నవతెలంగాణ-సారంగాపూర్

కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ ఉమ్మడి జిల్లాల నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికలలో ప్రచారంలో భాగంగా సోమవారం మండల కేంద్రంతో పాటు జామ్, రవీంద్రనగర్, మలక్ చించొలి, బొరిగామ్, అడెల్లి గ్రామాలతో అనుబంధ తండాలల్లో కాంగ్రెస్ మండల అధ్యక్షులు బొల్లోజి నర్సయ్యతో పాటు కాంగ్రెస్ నాయకులు ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కాంగ్రెస్ బలపరిచిన అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత వూట్కూరి నరేందర్ రెడ్డి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలని పట్టభద్రులను కోరారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రాజేశ్వర్, నవీన్‌రెడ్డి, నారాయణ రెడ్డి, లక్ష్మణ్, సత్యం, జగదీష్, రాము, బోజాగౌడ్, సుమన్, పోతన్న, భూమన్న ఉన్నారు.

పురుగులమందు తాగి మహిళ ఆత్మహత్య

నవతెలంగాణ-కడెం

పురుగులమందు తాగి వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై కృష్ణ సాగర్‌రెడ్డితెలిపిన వివరాల ప్రకారం.. గంగాపూర్ పరిధిలోని దేవునిగూడెం గ్రామానికి చెందిన పెంద్రం రాజేశ్వరి పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. తన భర్తతో చిన్నపాటి వాగ్వాదం జరగడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్టు తెలిపారు. గమనించిన కుటుంబీకులు నిర్మల్ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్టు ఎస్సై తెలిపారు.

ప్రజల ప్రాణాలపై పట్టింపు లేని కాంగ్రెస్ : ఆర్ఎస్పీ



నవతెలంగాణ-కాగజ్‌నగర్

ప్రజల ప్రాణాలంటే కాంగ్రెస్‌కు పట్టింపు లేదని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మండిపడ్డారు. కాగజ్‌నగర్ మండలం ఈజ్‌గాం మూల మలుపు వద్ద ఇరుకుగా ఉన్న వంతెనను వెడల్పు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కంటే ఎన్నికలే ముఖ్యమనే విధంగా సీఎం రేవంత్‌రెడ్డి తీరు ఉందని విమర్శించారు. ఎస్ఎల్‌బీసీ ప్రమాదంలో ఎనిమిది మంది పరిస్థితి విషమంగా ఉంటే రేవంత్‌రెడ్డి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో బిజీగా ఉన్నారని, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అమెరికాలో ఎంజాయ్ చేస్తున్నారని విమర్శించారు. సిర్పూరు నియోజకవర్గంలో ఇరుకు వంతెనల కారణంగా ఎంతోమంది మృత్యువాత పడుతున్నారని అన్నారు. ఈజ్‌గాం మూలమలుపు వద్ద ఉన్న ఇరుకు వంతెనపై నెలలో రెండు, మూడు ప్రమాదాలు జరిగి యువకులు మృత్యువాత పడుతున్నా పట్టించుకోవడం లేదని అన్నారు. కనీసం స్పీడ్ బ్రేకర్లు కూడా ఏర్పాటు చేయకపోవడం అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. నెల రోజులలో ఇరుకు వంతెనను వెడల్పు చేయని పక్షంలో తమ ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో పాటు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు సమస్య తీర్చకపోతే ఎన్నికల్లో ఓటెయ్యం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

దశబ్ద కాలంగా ఎదుర్కొంటున్న రోడ్డు సమస్యను పరిష్కరించకపోతే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేయమని భీంపూర్ మండల గ్రాడ్యుయేట్ జేఏసీ నాయకులు పేర్కొన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో జేఏసీ కమిటీ సభ్యులు నరేష్‌రెడ్డి మాట్లాడారు. ఎన్నో ప్రభుత్వాలు మారుతున్న తమ ప్రాంత రోడ్డు సమస్యను ఎదుర్కొంటూనే ఉన్నారు. పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చిన పట్టించుకున్న నాథుడే కరువయ్యారన్నారు. ప్రతి ఎన్నికల్లో పార్టీల నాయకులు వాగ్దానాలు చేస్తూ ఓట్లు దండుకుంటున్నారన్నారు. రోడ్డు సమస్య తీర్చడం ప్రభుత్వంతో కాకుంటే తమ మండలాన్ని పక్కన ఉన్న మహారాష్ట్రలో కలుపాలని డిమాండ్ చేశారు. రానున్న రోజుల్లో దశలవారీగా రోడ్డు సాధన కమిటీ ఆధ్వర్యంలో ఉద్యమిస్తామన్నారు. తమ గ్రామాల్లో ఏ నాయకున్ని, అధికారులను తిరగనివ్వమని తమకు తామే స్వయం పాలన చేసుకుంటామని స్పష్టం చేశారు. సమావేశంలో బొంత నితిన్, శైలందర్ యాదవ్, నితిన్ యాదవ్, లతీఫ్, శ్రీనివాస్ యాదవ్ ఆయా గ్రామాల గ్రాడ్యుయేట్‌లు పాల్గొన్నారు.

నిజామాబాద్ సీఎం సభకు కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

నిజామాబాద్‌లో నిర్వహించే ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార సభకు సీఎం రేవంత్‌రెడ్డి హాజరవుతున్న సందర్భంగా నిర్మల్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు, నిర్మల్ జెడ్పీటీసీల ఫోరం మాజీ అధ్యక్షులు పత్రిరెడ్డి రాజేశ్వర్, కాంగ్రెస్ నిర్మల్ మండలాధ్యక్షులు ఎంబరి గంగాధర్, ఎఫ్ఎస్సీఎస్ నిర్మల్ అధ్యక్షులు ధర్మాజీ రాజేందర్, పీఏసీఎస్ బన్సపల్లి చైర్మెన్ రమణరెడ్డి, పాకాల రామచందర్, శ్రీకాంత్ యాదవ్, నాలం శ్రీనివాస్, అనుముల భాస్కర్, ముడుసు సత్యనారాయణ, నాయకులు, కార్యకర్తలు, పట్టభద్రులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం



నవతెలంగాణ-ముధోల్

కాంగ్రెస్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి మద్దతుగా మండల కేంద్రంతో పాటు చించాల, వెంకటాపూర్, ఎడ్‌బిడ్, రాంటెక్, మచ్కల్, ముద్గల్, ఆష్టా, బ్రహ్మన్‌గాం, గన్నోర, తదితర గ్రామాలలో సోమవారం కాంగ్రెస్ నాయకులు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి నరేందర్‌రెడ్డికి మద్దతు తెలుపాలని ఓటర్లను కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చిందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ప్రేమ్‌నాథ్‌రెడ్డి, కిషన్ పటేల్, దిగాంబర్, సాయినాథ్, ఆరీఫ్, సురేందర్‌రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, ఖాలీద్, సుధాకర్, గంగారెడ్డి, రాంరెడ్డి పాల్గొన్నారు.

ఓంకారేశ్వర ఆలయాన్ని సందర్శించిన మున్సిపల్ కమిషనర్

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

మహాశివరాత్రి పండుగను పురస్కరించుకుని నిర్మల్ పట్టణంలోని వెంకటాద్రిపేట్‌లో గల ఓంకారేశ్వర ఆలయాన్ని మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్ సందర్శించారు. గుడి చెరువు పరిసరాల్లో మున్సిపల్ కార్మికులు చేపడుతున్నటువంటి పారిశుధ్య పనులను పరిశీలించి, సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బంది కలుగకుండా స్ట్రీట్ లైట్లు, నీటి సదుపాయం కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.